

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | శుక్రవారం 4-12-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:105 | పేజీలు:4 | వెల: రూ.1/-


# నేడే గ్రేటర్ ఎన్నికల కౌంటింగ్

**పక్కాగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**30 కేంద్రాల్లో 166 కౌంటింగ్ టేబుళ్ల ద్వారా లెక్కింపు**

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఓట్ల లెక్కింపునకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. గ్రేటర్‌లోని 150 డివిజన్లకు సంబంధించి ఓట్ల లెక్కింపు శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్లు, తర్వాత బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తారని ఎస్ఈసీ ప్రకటించింది. ఓట్ల లెక్కింపు కోసం 30 కేంద్రాల్లో 166 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసింది. ఒక్కో డివిజన్‌కు 14 టేబుళ్లతో కౌటింగ్ హాల్‌ను ఏర్పాటు చేశారు. అయితే కౌంటింగ్ హాల్ చిన్నగా ఉన్న 16 డివిజన్లకు రెండు హాళ్లను కేటాయించారు. ఒక్కో కౌంటింగ్ హాల్‌లో రిటర్నింగ్ అధికారి, సహాయ రిటర్నింగ్ అధికారి ఉంటారని తెలిపింది. ప్రతి కౌంటింగ్ కేంద్రానికి పరిశీలకుడిని నియమించింది. అభ్యర్థులు ఒక్కో టేబుల్‌కు ఒక ఏజెంట్‌ను నియమించుకునే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఏజెంట్లకు రిలీవింగ్ సౌకర్యం లేదని స్పష్టం చేసింది. కౌంటింగ్ హాళ్లలోకి మొబైల్‌ఫోన్లు తీసుకెళ్లడంపై నిషేధం విధించింది. ఏజెంట్లు రిటర్నింగ్ అధికారుల వద్ద పాసులు తీసుకోవాలని ప్రకటించింది. పాసులు లేనివారికి అనుమతి లేదని వెల్లడించింది. అన్ని కౌంటింగ్ హాళ్లలో వీడియోగ్రఫీ, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఎన్నికల పరిశీలకుడి అనుమతి తర్వాత ఫలితాలు ప్రకటిస్తామని, అనుమానిత ఓట్లకు సంబంధించి రిటర్నింగ్ అధికారిదే తుది నిర్ణయమని స్పష్టం చేసింది. ఫలితాలు ప్రకటించడానికి ముందే రీకౌంటింగ్ కోసం రిటర్నింగ్ అధికారికి విజ్ఞప్తి చేయాలని సూచించింది. అభ్యర్థులకు సమానంగా ఓట్లు వస్తే లాటరీ పద్ధతిలో డ్రా తీస్తామని, దానికి అనుగుణంగా తుది ఫలితాలను ప్రకటిస్తామని వెల్లడించింది. మరోవైపు జీహెచ్ఎంసీ ఎన్నికల కౌంటింగ్‌కు సర్వ సిద్ధం కాగా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 46.55 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 34,50.256 మంది ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటగా మెహదీపట్నం డివిజన్ ఫలితం వచ్చే అవకాశం ఉంది. ఫలితాల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

## ఎక్స్ అఫీషియో ఓటింగ్‌పై విచారణ

**వచ్చేనెల 4కు కేసు వాయిదా వేసిన హైకోర్టు**

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): మేయర్, డిప్యూటీ మేయర్ ఎక్స్ అఫిషియో సభ్యుల ఓటు హక్కుపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఓటు హక్కును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలైంది. బాల్కొండ మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 90(1) కొట్టివేయాలని పిటిషన్‌లో అనిల్ కుమార్ కోరారు. దీనిపై విచారించిన హైకోర్టు.. వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వం, ఎస్ఈసీ, జీహెచ్ఎంసీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను తెలంగాణ హైకోర్టు జనవరి 4కు వాయిదా వేసింది. తెలంగాణలో ఎక్స్‌అఫీషియోల 50మంది వరకు ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరి ద్వారా అసలు ఎన్నికైన వారిపై ప్రభావం చూపనుందని పిటిషనర్ వాదించారు.



నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అంత్యక్రియల్లో పాల్గొన్న సీఎం కెసిఆర్ తదితరులు

# తమిళనాట రాజకీయ తుఫాన్

**రాజకీయ పార్టీపై ప్రకటన చేసిన తలైవా**

**డిసెంబర్ 31న వివరాలు వెల్లడిస్తానన్న రజనీ**

**ఫుల్ జోష్‌లో రజనీ అభిమానులు ..తమిళనాట సంబరాలు**

చెన్నై,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): తమిళ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ పార్టీ రాబోతోంది. తుఫాన్ ఆవరించి ఉన్నవేళ తలైవా రాజకీయ తుఫాన్‌కు కారణమయ్యారు. ఇంతకాలం నాన్చుతూ వచ్చిన రాజకీయ పార్టీ ప్రకటనను ఎట్టకేలకు ప్రకటించేశారు. దీంతో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మార్పులు స్పష్టంగా కానరానున్నాయి. ఇంతకాలం ఎటూ తేల్చలేక పోయిన సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగప్రవేశంపై ఎట్టకేలకు సస్పెన్స్ వీడింది. జనవరిలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు తలైవా గురువారం ప్రకటన చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు డిసెంబరు 31న వెల్లడిస్తానని ట్విటర్ వేదికగా స్పష్టం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడును సమూలంగా మారుస్తామని పేర్కొన్నారు. తనకు మద్దతుగా నిలుస్తున్న వారందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దీంతో తమకు అదిరిపోయే న్యూ ఇయర్ గిఫ్ట్ ఇచ్చారంటూ తలైవా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రజనీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశిసుండటంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. కాగా వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో రజనీ మక్కల్ మండ్రం ముఖ్య నిర్వాహకులు, జిల్లాల కార్యదర్శులతో సోమవారం రజనీకాంత్ భేటీ అయిన విషయం తెలిసిందే. చెన్నైలోని రాఘవేంద్ర కళ్యాణ మండపం వేదికగా ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'మా అభిప్రాయాలను పంచుకున్నాం. నేను ఎటువంటి నిర్ణయం తీసుకున్నా అండగా ఉంటామనే భరోసా ఇచ్చారు. వీలైనంత త్వరగా నా నిర్ణయం ప్రకటిస్తాను' అని రజనీ వెల్లడించారు. ఈ క్రమంలో నేడు పార్టీ ప్రారంభం గురించి ప్రకటన విడుదల చేయడం గమనార్హం. రజనీకాంత్ ఈ పేరు తెలియని భారతీయులు ఉండరనడంలో అతిశయోక్తేమీ లేదు. రజనీ కాంత్‌కు ప్రపంచవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ ఉంది. ఎంతలా అంటే అతడి కబాలీ సినిమాకు పెద్దపెద్ద సంస్థల ఉద్యోగులకు సెలవులు ఇచ్చి మరీ సినిమా చూసుకోమని చెప్పాయి.

ఆ తరువాత తమిళనాడు రాజకీయాల్లోకి రజనీ అరంగేట్రం చేయనున్నాడని వార్తలు వచ్చాయి. అయితే అతని అభిమానులు ఎప్పుడెప్పుడు రజనీ పార్టీ పెడతాడా అని ఎదురు చూశారు. ఇటీవల రజనీ తన ట్విటర్ ద్వారా తన కొత్త పార్టీ ప్రకటన గురించి తెలిపారు. తాను ఫేమ్ కోసమో,డబ్బుకోసమో రాజకీయాల్లోకి రావట్లేదని రజనీ ఇంతకు ముందే ఎన్నో సార్లు తెలిపారు. తన పార్టీకి సంబంధించిన సమాచారాన్ని డిసెంబరు 31న ప్రకటిస్తానని, పార్టీను మాత్రం వచ్చే ఏడాది జనవరీలో స్థాపిస్తామని రజనీ ఓ ట్వీట్ చేశారు. అంతేకాకుండా 2021 ఎన్నికల్లో పోటీ చేస్తామని తెలిపారు.



ప్రజాగళమై అవినీతి ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే రజనీ పార్టీను పెడుతున్నారని అంటున్నారు. ఈ వార్త తమిళనాడు రాజకీయ పార్టీలలో పెను సంచలనంగా నిలిచింది. దీనిపై ఎవరు ఎలా స్తందిస్తారో చూడాలి. రజనీ పార్టీకు తమిళ ప్రజల ఆదరణ పూర్తి స్థాయిలో ఉంది. అయితే రజనీ పార్టీకి సంబంధించిన మరిన్ని వివరాల కోసం వేచి చూడాల్సిందే. ఇక సినీరంగం నుంచి రాజకీయాల్లో ప్రవేశించి ముఖ్యమంత్రులుగా తమదైన ముద్రవేసిన కరుణానిధి, జయలలిత మరణం తర్వాత తమిళనాట రాజకీయాలు అస్తవ్యస్తంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విశ్వనాయకుడు కమల్‌హాసన్, సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే డిమాండ్లు మరింత ఉధృతమయ్యాయి. ఇక కమల్ ఇప్పటికే మక్కల్ నీది మయ్యం పేరిట పార్టీ స్థాపించగా.. 2017 డిసెంబరులో 'అరసియల్‌కు వరువదు ఉరుది' అంటే రాజకీయాల్లోకి రావడం ఖాయం అని బహిరంగంగా ప్రకటించిన తలైవా అనేక పరిణామాల అనంతరం పార్టీ స్థాపన దిశగా పయనించడం గమనార్హం.

## కౌంటింగ్ ఏజెంట్లతో బండి సమీక్ష

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): బీజేపీ కౌంటింగ్ ఏజెంట్లతో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గురువారం సమావేశమయ్యారు. నేడు జీహెచ్ఎంసీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఏజంట్లు తీసుకో వాల్సిన జాగ్రత్తలపై సంజయ్ సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ అవరవీరుడు శ్రీకాంతాచారి వర్థంతి సందర్భంగా సమావేశంలో నాయకులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## రైతులకు మద్దతుగా ఆందోళన

**అఖిలపక్ష రైతుల సంఘాల రాస్తారోకో**

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు, విద్యుత్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా తెలంగాణ వ్యాప్తంగా అఖిలపక్ష రైతు సంఘాలు ఆందోళన నిర్వహించాయి. ఢిల్లీలో రైతులపై నిర్బంధానికి వ్యతిరేకంగా రైతు సంఘాల పిలుపు మేరకు హైదరాబాద్-గోల్కొండ క్రాస్‌రోడ్డు వద్ద రైతులు పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. వీరికి కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు, ఏఐకేఎస్‌సీసీ ప్రతినిధులు తీగల సాగర్, బి.వెంకట్ తదితరులు మద్దతు తెలిపారు. రైతుల ఉద్యమం పట్ల కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తోందని రైతు సంఘాలు ఆరోపించాయి. వ్యవసాయ రంగం, రైతుల ప్రయోజనాలకు భిన్నంగా మోదీ సర్కారు కార్పోరేట్లకు అనుకూలంగా చర్యలు తీసుకుంటోందని విమర్శించాయి. ఇప్పటికైనా కేంద్రం స్పందించి మూడు వ్యవసాయ చట్టాలు, విద్యుత్ సవరణ బిల్లు సవరించుకోకపోతే ఈ నెల 5న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని రైతుల సంఘాలు హెచ్చరించాయి. రైతుల ఆందోళనలో వాహనాల రాకపోకలను తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు అందోళనకారులను అరెస్టు చేశారు.

# ఎమ్మెల్యే నోముల అంత్యక్రియలు పూర్తి

**సొంత వ్యవసాయ క్షేత్రంలో అధికార లాంఛనాలతో నిర్వహణ**

**నివాళి అర్పించిన సిఎం కెసిఆర్..మంత్రులు**

**అంతిమయాత్రకు భారీగా హాజరైన అభిమానులు, నేతలు**

నల్లగొండ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పాలెంలో పూర్తయ్యాయి. వేలాదిగా తరలివచ్చినఅభిమానులు, పార్టీ కార్యకర్తలు, నేతల సమక్షంలో అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి చేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ఉదయం 11:30 గంటలకు పాలెం చేరుకుని, నోముల భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. నోముల కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్ రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పలువురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. నోముల నర్సింహయ్య అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో ఆయన స్వగ్రామమైన పాలెంలో పూర్తయ్యాయి. ప్రగతిభవన్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన సిఎం కెసిఆర్ నేరుగా నర్సింహయ్య అంత్యక్రియలు జరిగే ప్రదేశానికి చేరుకున్నారు. నోముల నర్సింహయ్య భార్య, కుమారుడిని ఓదార్చారు. సీఎం కేసీఆర్ చేరుకున్న కాసేపటికే అంత్యక్రియల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు వ్యయసాయ క్షేత్రం వరకు నోముల నర్సింహయ్య అంతిమయాత్ర చేపట్టారు. ఉదయం నకిరేకల్‌లో నోముల నర్సింహయ్య అంతిమయాత్ర ప్రారంభమైంది. మెయిన్ రోడ్ నుంచి అంతిమయాత్ర సాగింది. తమ నేతకు తుది వీడ్కోలు పలికేందుకు భారీగా అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కదలివచ్చారు. నోముల స్వగ్రామం పాలెంలోని వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాల ప్రకారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. నోముల నర్సింహయ్య అంత్యక్రియల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్న కెసిఆర్ గంటపాటు అక్కడే ఉన్నారు.

నోముల మృతి పట్ల పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. ఈ అంత్యక్రియలలో జిల్లాకు చెందిన లీడర్లే కాకుండా.. రాష్ట్రంలోని పలువురు నాయకులు, అభిమానులు, సీపీఎం పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆయన టీఆర్ఎస్‌లో చేరడానికి ముందు నకిరేకల్ నియోజకవర్గంలో సీపీఎం పార్టీ నుంచి 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన చిన్నప్పటి నుంచి కష్టపడి పనిచేసే తత్వం కలవాడు కాబట్టి పేదల కష్టాలు ఆయనకు బాగా తెలుసు. అందుకే కష్టమంటూ తన దగ్గరికొచ్చిన ప్రతివారికి సాయం చేశాడు. ఆయన నకిరేకల్ నియోజకవర్గంలో తిరగని ఊరు లేదు. కాబట్టే ఆయనకు ప్రతి ఊరులోనూ అభిమానులు వేలసంఖ్యల్లో ఉంటారు.

# చివరి దశలో వ్యాక్సిన్ ట్రయల్స్

**ఈనెలఖారుకు అత్యవసర వినియోగానికి వచ్చే అవకాశం**

**ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా వెల్లడి**

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): భారతదేశంలో కొన్ని వ్యాక్సిన్లు చివరి దశ ట్రయల్స్‌లో ఉన్నాయని ఢిల్లీ ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా చెప్పారు. డిసెంబర్ చివరినాటికి లేదా వచ్చే నెల ఆరంభంలో భారత నియంత్రణ అధికారుల నుంచి అత్యవసర వినియోగ అధికారాన్ని ఇవ్వగలమని తాను ఆశిస్తున్నానని చెప్పారు. అప్పుడు సాధారణ ప్రజలకు టీకాలు వేయడానికి ఉపయోగించబడుతుంది. టీకాలు సురక్షితంగా ఉన్నాయని, దానికి సంబంధించిన తగినంత డేటా అందుబాటులో ఉన్నదని, టీకాల భద్రత, సమర్థత విషయంలో ఏమాత్రం రాజీపడబోమని ఆయన చెప్పారు. దేశంలో ఇప్పటివరకు 70-80 వేల వాలంటీర్లకు వ్యాక్సిన్ ఇచ్చారని, వారిలో గణనీయమైన తీవ్రమైన ప్రతికూల ప్రభావాలు కనిపించలేదని తెలిపారు. స్వల్పకాలిక వ్యాక్సిన్ సురక్షితంగా ఉందని డేటా చూపిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భారతదేశంలో పరిశీలనలో ఉన్న వ్యాక్సిన్లలో ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా కొవిడ్-19 వ్యాక్సిన్ ఉన్నాయి. వీటిని సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఉత్పత్తి చేస్తున్నది. మన దేశంలో కోవిషీల్డ్ అని పిలిచే ఈ టీకా కారణంగా తనకు తీవ్రమైన నాడీ, మానసిక లక్షణాలను ఇచ్చిందని చెన్నైకి చెందిన ఒక ట్రయల్ పార్టిసిపెంట్ ఆరోపించారు. అయితే ఫార్మా కంపెనీ అటువంటి వాదనలన్నింటినీ ఖండించింది. భారతదేశంలో పరీక్షించబడుతున్న ఇతర వ్యాక్సిన్లు రష్యాకు చెందిన స్పుత్నిక్ వీ. ప్రస్తుతం డాక్టర్ రెడ్డీస్ ప్రయోగశాలలలో పరీక్షల్లో ఉన్నాయి. ఈ టీకా ఆగస్టులో రష్యాలో ప్రజల ఉపయోగం కోసం ఆమోదించబడింది. అయినప్పటికీ, వ్యాక్సిన్ యొక్క పరీక్షలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల జరుగుతున్నాయి.

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

**రూ.3,016ల పెన్షన్ ఇస్తున్న ఘనత మాదే: కవిత**

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ జిల్లాలకు చెందిన దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిశారు. దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్‌కు వారంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగులకు రూ.3,016ల పెన్షన్ ఇస్తున్న ఘనత టీఆర్ఎన్ ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో దివ్యాంగులకు కేవలం రూ.500 పెన్షన్ ఇచ్చేవారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చాక రూ.1500, రెండోసారి రూ.3016 కు పెంచామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4,98,565 మంది లబ్దిదారులకు ఆసరా పించన్లను అందిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నామన్నామని పేర్కొన్నారు.దివ్యాంగులు పలు వినతులు అందించగా వాటన్నింటినీ సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు దివ్యాంగులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని దివ్యాంగులకు భరోసానిచ్చారు. సీఎం కేసీఆర్ దివ్యాంగుల సంక్షేమంలో దేశంలోనే ఒక రోల్‌మోడల్‌గా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేతకాని, 21 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో రాత్రి కర్ఫ్యూ ఆలోచన లేదు

**హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం**

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం రాత్రి వేళ కర్ఫ్యూ అమలు చేయడం లేదని ఢిల్లీ హైకోర్టుకు ఆప్ ప్రభుత్వం గురువారం తెలిపింది. కరోనా తీవ్రత మరోసారి పెరుగుతున్న నేపథ్యంలో నైట్ కర్ఫ్యూ అమలుపై తక్షణం స్పందించాలని ద్విసభ్య ధర్మాసనం ఈ నెల 26న ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని నాడు కోర్టుకు తెలిపిన ప్రభుత్వం తాజాగా రాత్రి వేళ కర్ఫ్యూను ప్రస్తుతం అమలు చేయబోవడంలేదని తెలిపింది. ఈ నెల 31 వరకు ఎలాంటి మార్పులు ఉండబోవని పేర్కొంది. ఈ మేరకు గురువారం స్టేటస్ రిపోర్ట్‌ను కోర్టుకు సమర్పించింది. అలాగే కరోనా నిబంధనలు ఉల్లంఘించిన వారికి రెండు లక్షలకుపైగా చలాన్లు విధించి రూ.17 లక్షలకుపైగా జరిమానా వసూలు చేసినట్లు తెలిపింది. ఢిల్లీ పోలీసులు ఇప్పటి వరకు మొత్తం 5 లక్షలకుపైగా చలాన్లు విధించి రూ.27 లక్షలకుపైగా జరిమానా వసూలు చేసినట్లు వెల్లడించింది.

## శ్రీకాంతాచారి త్యాగం చిరస్మరణీయం

**నివాళి అర్పించిన మంత్రి ఎర్రబెల్లి**

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): మలిదశ తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన తొలి అమరుడు శ్రీకాంత చారి అని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆయన మా ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక పోయాడు. అతి చిన్న వయస్సులో స్వరాష్ట్రం కోసం అమరుడు కావడం బాధాకరమని అన్నారు. శ్రీకాంత చారి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ శ్రీకాంత చారి త్యాగాన్ని గుర్తించి ఆయన తమ్ముడికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించామని చెప్పారు. తెలంగాణ కోసం ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగ ఫలితంగా తెలంగాణ రాష్ట్రాన్నిసాధించుకున్నామని చెప్పారు.

## మాదకద్రవ్యాల విక్రయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

హైదరాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): డ్రగ్స్ అమ్ముతూ ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అడ్డంగా దొరికిపోయారు. గోవా, విశాఖపట్టణం ఏజెన్సీల నుంచి మాదక ద్రవ్యాలను తీసుకువచ్చి విక్రయిస్తూ హైదరాబాద్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చిక్కిపోయారు. మౌలాలీ ఆర్టీసీ కాలనీకి చెందిన శివసేనారెడ్డి, వనస్థలిపురం కమలానగర్ వాసి మేకసాయి, ఘట్కేసర్ పోచారంలోని సింగపూర్ టౌన్‌షిప్ నివాసి హర్షవర్ధన్ ప్రముఖ సంస్థల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం తార్నాకలో వారిని అరెస్టు చేసింది. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

.....................

## చరిత్రలో నేటినిజం



కం॥ మారని విలువలు గలిగిను
మారినవాళ్ళా వరశాఖ మార్పుల యాడన
భారత ప్రధాన మంత్రిగ
ఆరాధన జేయు బడెను ఐ.కే. గుజ్రాల్!!

(డిసెంబర్ 4 ఐ.కే. గుజ్రాల్ జయంతి..)



-రాధశ్రీ

సెల్: 9494481210

# పేదింటి ఆడబిడ్డలకు వరం..కల్యాణలక్ష్మి, షాదీముబారక్



సిద్దిపేట, డిసెంబర్ 3: దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని..పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు ఓ వరమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలోని ఆయన నివాసంలో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందన్నారు. అలాగే లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు సరే..సంక్షోభాలకు సమాధానం ఎలా?

నేటినిజం
శుక్రవారం 4-12-2020

నిప్పులేనిదే పొగరాదంటారు. జమిలి ఎన్నికలపైనా ఇప్పుడు అదే అనుమానం కలుగుతోంది. గతకొంత కాలంగా అంటే బిజెపి అధికారంలోకి వచ్చాక జమిలి ఎన్నికలపై ప్రధాని మోడీ సహా అనేకులు చర్చకు ఆస్కారం ఇచ్చారు. ఇటీవల జరిగిన ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో ప్రధాని మోడీ మరోమారు ఈ ప్రస్తావన తీసుకుని వచ్చారు. నిజానికి గత సార్వత్రిక ఎన్నికలతోనే జమిలి ఎన్నికలకు వెళతారన్న ఊహాగానాలు వచ్చాయి. కానీ ఎందుకనో ఆగిపోయారు. ఈ లోగా తెలంగాణలో ముందస్తు ఎన్నికలు జరిగాయి. తరవాత సార్వత్రిక ఎన్నికలు..మొన్నటికి మొన్న బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే ఈ ఎన్నికల కారణంగా దేశంలో వేలాదికోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన డబ్బులు ఇలా తగలేయాల్సి వస్తోంది. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే అసెంబ్లీలకు, లోక్‌సభల్లో అర్థాంతరంగా ఏర్పడే రాజకీయ సంక్షోభాలకూ, అనిశ్చితికీ ఎలాంటి ప్రతిపాదనలు తీసుకుని రానున్నారో ముందు చర్చించాలి. రాజ్యాంగ పరంగా దీనికి స్పష్టత, చట్టబద్దత రావాలి. ఒకమారు ఎన్నికలు జరిగితే మళ్లీ,మళ్లీ ఎన్నికలు జరక్కుండా రాజ్యాంగంలో ఏర్పాటు ఉండాలి. గతానుభవాల దృష్ట్యా ఇందుకు ఎటువంటి పరిష్కారం చూపదల్చుకున్నారో ముందు చర్చించాలి. గ్రామస్థాయి నుంచి ఢిల్లీస్థాయి వరకు చర్చ జరగాలి. ఇలా పటిష్ట ఎన్నికల విధానం ఒకేమారు..అదీ ఐదేల్లకో.. లేదా ఆరేళ్లకో చేసుకునేలా చట్టాలను రూపొందించుకోవాలి. ఇవి తెలిస్తే తప్ప జమిలి ఎన్నికలపై ఎవరూ సానుకూలంగా స్పందించడానికి సిద్దంగా లేరు. ఇదే సమయంలో ప్రస్తుత విధానంలో అధిక సమయం వివిధ ఎన్నికలపైనే దృష్టి సారించాల్సి వస్తోంది. ఈ సందర్బంగా అభివృద్ధి కూడా కుంటుపడుతోంది. ఎక్కడో ఓ చోట ఏదో ఒక ఎన్నిక అన్నది దేశంలో నిత్యకృత్యంగా మారింది. ఈ దశలో జమిలి ఎన్నికల ప్రతిపాదనను ప్రధాని మోడీ తీసుకుని వచ్చారు. దీనికి సర్వత్రా ఆమోదం కూడా వస్తోంది. ప్రజలు కూడా వరుస ఎన్నికలతో చికాకు పడుతున్నారు. ఈ క్రమంలో గుజరాత్ కెవాడియాలో జరిగిన 80వ అఖిల భారత ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా కొన్ని నెలల వ్యవధిలో నిర్వహించే ఎన్నికలు, అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తాయని, ఈ కారణంగా ఎన్నికలను ఒకేసారి నిర్వహించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇలా ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి జమిలి ఎన్నికల ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. ఆ అంశంపై అందరూ అధ్యయనం చేయాలని కోరారు. చట్టసభలన్నిటికీ ఒకేసారి ఎన్నికలు జరగడం మన దేశానికి ఎంతో అవసరమని పిలుపునిచ్చారు. ఇప్పుడే కాదు... అధికారంలో లేనప్పుడు కూడా బీజేపీ జమిలి ఎన్నికలుండాలని కోరుకుందని గుర్తు చేశారు. ఆ పార్టీ సీనియర్ నేత ఎల్.కె. అద్వానీ ఈ అంశంపై 2012లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి లేఖ రాశారు. ఎక్కడో ఒకచోట కొన్ని నెలల వ్యవధిలో ఎన్నికలు జరుగుతుంటే వాటి ప్రభావం అభివృద్ధి కార్యకలాపాలపై పడుతున్నదన్ని నూటికినూరుపాళ్లు నిజం. వేర్వేరు ఓటర్ల జాబితాల వల్ల వృధా వ్యయం తప్ప ఉపయోగం లేదని ప్రధాని మోదీ భావిస్తున్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ ఆలోచన ఇప్పుడు మళ్లీ తెరపైకి రావడంతో బిజెపి చురుకుగా పావులు కదుపుతుందని భావించాలి. బిజెపి పాలనను గమనిస్తే గత ఆరేళ్లలో వారు చెప్పినవి చెప్పినట్లుగా చేస్తూనే ఉన్నారు. కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య సమస్య, పౌరసత్వ సమస్య.. ఇలా అనేకానేక జటిల సమస్యలను మెల్లగా పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇటీవలే చరిత్రాత్మక వ్యవసాయ చట్టాలను కూడా తీసుకుని వచ్చారు. దీంతో వారు అనుకున్నది చేయడం ద్వారా ముందుకు పోతున్నారు. ముమ్ముందు అనేకానేక సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తున్నట్లు ప్రధాని మోడీ గతంలో ఓ మారు ప్రకటించారు. అలాగే జమిలి ఎన్నికలను కూడా కేవలం మాటలకు మాత్రమే పరిమితం చేయలేమని, ఈ ఆలోచన ప్రస్తుతం దేశ అవసరమని ప్రధాని నరేంద్ర మోదీ పునరు ద్ఘాటించారు. వచ్చే ఏడాది తమిళనాడులో ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇలా ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సమయంలో ఎన్నికలు నిజంగానే అభివృద్ధికి ప్రతిబంధకంగా మారాయనే చెప్పాలి. అందుకే జమిలి ఎన్నికల విషయంలో లోతైన అధ్యయనం, చర్చ అవసరమని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ప్రిసైడింగ్ అధికారులు ఈ విషయంలో చొరవ తీసుకొని ఈ అంశంపై చర్చకు నాంది పలకాలన్నారు. జాతీయ, రాష్ట్ర, పంచాయతీ, స్థానిక ఎన్నికలకు వేర్వేరు ఓటింగ్ కార్డులు అవసరం లేదని తెలిపారు. ఓటరు కార్డులను క్రమబద్ధీకరించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా మోదీ సూచించారు. లోక్‌సభ, విధానసభ, ఇతర ఎన్నికలకు ఒకే ఓటరు జాబితాను మాత్రమే ఉపయోగించాలని, ఈ జాబితాల తయారీకి ఎందుకు సమయం, నిధులు వృథా చేస్తున్నామని మోదీ ప్రశ్నించారు. నిజంగానే ఇది చర్చ చేయాల్సిన అంశం. మొన్నటి గ్రేటర్ ఎన్నికల్లో చాలామంది తమ ఓట్లు గల్లంతయ్యాయని గోల చేశారు. అలా ఎందుకు జరిగిందన్న దానికి సమాధానం లేదు. ఇకపోతే బిజెపి రాజ్యాంగం, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరుకుంటోంది. 2019 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో 'వన్ నేషన్, వన్ ఎలక్షన్'ను కీలకంగా పొందుపరిచింది. ఈ అంశంపై మోదీ ఇప్పటికే అనేకసార్లు ప్రస్తావించారు. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్'పై చర్చించేందుకు గతేడాది జూన్‌లో ప్రధాని అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే ప్రతిపక్ష పార్టీలకు చెందిన అనేకమంది కీలక నాయకులు హాజరుకాకపోవడంతో ఈ విషయంపై చర్చ సరిగ్గా జరగలేదు. ఇకపోతే ఆయా రాష్ట్రాల్లో కూడా పంచాయతీ, స్థానికసంస్థల ఎన్నికలు తీరు వేర్వేరుగా వుంటోంది. వాస్తవానికి 1952 తొలి సార్వత్రిక ఎన్నికలతో మొదలుపెడితే 1967 వరకూ చట్టసభలకు జమిలి ఎన్నికలే జరిగాయి. అయితే 1972లో ముగియాల్సిన లోక్‌సభను నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఏడాదిముందే రద్దు చేయడంతో 1971లోనే ఎన్నికలు వచ్చాయి. 1984లో రాజీవ్ గాంధీ కూడా ఆ పనే చేశారు. గడువుకు ముందే లోకసభను రద్దు చేశారు. అనంతరకాలంలో ఏర్పడిన ప్రభుత్వాలు మూన్నాళ్ల ముచ్చటగా ముగిశాయి. 1989, 1999ల్లో ఏర్పడ్డ ప్రభుత్వాలు రెండేళ్ల వ్యవధిలోనే కుప్పకూలడంతో మధ్యంతర ఎన్నికలు తప్పలేదు. మధ్యలో 1991 ఎన్నికల అనంతరం అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు అయిదేళ్లూ పాలించారు. తిరిగి 1996 ఎన్నికల తర్వాత 1998 వరకూ రెండేళ్లలోనే ఏబీ వాజపేయి, హెచ్‌డీ దేవెగౌడ, ఐకె గుజ్రాల్ వరసగా ప్రధానులయ్యారు. ఆ తర్వాత మళ్లీ మధ్యంతర ఎన్నికలు తప్పలేదు. ఆ తర్వాత నుంచి సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. తగినంత మెజారిటీ లేక రాజీనామా చేయాల్సిరావడం,కేంద్రంలో అధికారం చలాయించే పాలకులకు ఆగ్రహం కలిగినప్పుడు ప్రభుత్వాలను బర్తరఫ్ చేయడం వంటి కారణాల వల్ల కూడా మధ్యంతర ఎన్నికలు అనివార్యంగా మారాయి. వీటికి పరిష్కారం చూపే విధంగా రాజ్యాంగ సవరణలు చేసుకున్నప్పుడే జమిలి ఎన్నికలు సాధ్యమని గుర్తించాలి.

## ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా జమ్మికుంటకు గుర్తింపు

### -హోంశాఖ జాబితాలో జమ్మికుంటకు ఐదో స్థానం

హైదరాబాద్,డిసెంబర3(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా అత్యుత్తమ పోలీస్‌స్టేషన్ల జాబితాను కేంద్ర హోంశాఖ గురువారం ప్రకటించింది. టాప్‌టెన్ జాబితాలో కరీంనగర్ జిల్లా జమ్మికుంట పోలీస్‌స్టేషన్ నిలిచింది.

తొలిస్థానంలో మణిపూర్‌కు చెందిన నాంగ్‌పోక్షిక‌మై పోలీస్‌స్టేషన్ నిలువగా, పదో స్థానంలో జమ్మికుంట ఠాణా నిలిచింది. దేశ వ్యాప్తంగా 16,671 పోలీస్‌స్టేషన్లకు వివిధ విభాగాల్లో స్టేషన్ల పనితీరు ఆధారంగా ర్యాంకులు ఇవ్వాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. 2015లో గుజరాత్ కచ్‌లో జరిగిన డీజీపీల సదస్సులో పోలీస్‌స్టేషన్ల పనితీరు గురించి ప్రత్యేకంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. డేటా విశ్లేషణ, పనితీరు పరిశీలన, ప్రజల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఆయా పోలీస్‌స్టేషన్లకు హోంశాఖ ర్యాంకులు ప్రకటిస్తోంది. ఆస్తులకు సంబంధించిన నేరాలు, మహిళలపై దాడులు, బలహీన వర్గాలపై దాడులు, తప్పిపోయిన వ్యక్తులు, గుర్తు తెలియని వ్యక్తులు, గుర్తు తెలియని వ్యక్తుల ఆచూకీ గుర్తింపు తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ర్యాంకులు కేటాయిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రకటించిన ర్యాంకుల్లో టాప్10లో జమ్మికుంట పోలీస్‌స్టేషన్ నిలువడంపై రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి సిబ్బందిని అభినందించారు. టాప్‌టెన్‌లో నిలిచినందుకు గర్వపడుతున్నట్లు ట్వీట్ చేశారు.

## అభివృద్ధిలో నంబర్‌వన్‌గా తెలంగాణ

### సంక్షేమపథకాల అమలులో సిఎం కెసిఆర్ దూరదృష్టి: కొప్పుల

జగిత్యాల,డిసెంబర్2(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తున్నదని, కరోనా సంక్షోభంలోనూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండలంలో రూ.2.80 కోట్ల నిధులతో చేట్టిన, చేపట్టే పలు అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంతతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం నుంచి వందలాది కోట్ల రూపాయలను పన్నుల రూపంలో కేంద్రం తీసుకెళుతున్నదని, తిరిగి రాష్ట్రానికి నిధులు ఇవ్వడంలో మోకాలడ్డుతోందని విమర్శించారు. కేంద్రం సహకరించకున్నా సీఎం కేసీఆర్ మొక్కవోని ధైర్యంతో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే, మరో వైపు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని వివరించారు. ప్రభుత్వం అర్హులందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లను మంజూరు చేస్తుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు.

## దేశవ్యాప్తంగా 8 నుంచి సరుకుల రవాణా బంద్

### రైతు సంఘాల ఆందోళనకు ఏఐఎంటీసీ మద్దతు

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని గత ఆరు రోజుల నుంచి రైతు సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. వీరికి ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) మద్దతు ప్రకటించింది. దీంతో డిసెంబర్ 8 నుంచి ఉత్తర భారతదేశంలో సరుకు రవాణా వాహనాలను బంద్ చేస్తున్నట్లు ఏఐఎంటీసీ ప్రకటించింది. ఆ చట్టాలను రద్దు చేయకపోతే మొత్తం దేశవ్యాప్తంగా సరుకు రవాణాను నిలిపేస్తామని హెచ్చరించింది. డిసెంబర్ 8 నుంచి ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హిమాచల్, జమ్ముకశ్మీర్‌తోసహా అన్ని ఉత్తరాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో తమ వాహనాలను నిలిపివేస్తున్నట్లు ఏఐఎంటీసీ అధ్యక్షుడు కుల్తరన్ సింగ్ అత్వాల్ చెప్పారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే దేశవ్యాప్తంగా సరుకు రవాణాను నిలిపేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## నల్ల చట్టాలు రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినది కాదు

### అమరీందర్ సింగ్ దిగజారుడు రాజకీయాలు

### పంజాబ్ సీఎంపై ఢిల్లీ సీఎం ఫైర్

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ పై ఫైర్ అయ్యారు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం నల్ల చట్టాలు(నూతన అగ్రి చట్టాలు)పాస్ చేసిందని పంజాబ్ సీఎం తనపై ఆరోపణలు చేశారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న సున్నితమైన పరిస్థితుల్లో ఇలాంటి దిగజారుడు రాజకీయాలు ఎలా చేయగల్గుతున్నారంటూ అమరీందర్ ని ప్రశ్నించారు కేజ్రీవాల్. ఆ చట్టాలను అమలుచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినది కాదని..అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినది అయితే దేశంలోని రైతులు కేంద్రంతో ఎందుకు చర్చలు జరుపుతున్నారని కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీలోని తొమ్మిది స్టేడియాలను ఓపెన్ జైళ్లుగా మార్చేందుకు తాము అనుమతించలేదనే కారణంతోనే పంజాబ్ సీఎం తనపై ఆరోపణలు చేశారని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ స్టేడియాలలో రైతులను ఉంచాలని కేంద్రం కూడా ఆలోచించిందని తెలిపారు. అయితే,స్టేడియాలను జైళ్లుగా మార్చేందుకు తాను అనుమతించకపోవడంతో వారు నిరాశచెందారని ఆప్ అధినేత తెలిపారు. మరోవైపు, ఢిల్లీ ప్రభుత్వం రైతు చట్టాలను పాస్ చేస్తోందంటూ పూర్తిగా అవాస్తవమైన ఆరోపణలు చేసేందుకు పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్,భారతీయ జనతా పార్టీ చేతులు కలిపాయని ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్ యూనిట్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. కాగా, కేంద్రం ఆమోదించిన నూతన వ్యవసాయ చట్టాలను ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీలో నోటిపై చేసిందంటూ మీడియా రిపోర్ట్ లు బయటకిరావడంతో కాంగ్రెస్,ఆప్ నేతల మధ్యల మాటల యుద్ధం కొనసాగుతోంది. అయితే మీడియాలో వచ్చిన ఆ రిపోర్ట్ లు ఫేక్ అని తెలుస్తోంది. అయితే, ఇదే సమయంలో ఢిల్లీ ప్రభుత్వంపై పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. వారికి సిగ్గు లేదా? కేంద్రం చేసిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పంజాబ్ లో చేసిన విధంగా ఢిల్లీ అసెంబ్లీలో ఏదైనా సవరణ చేయడంలో వాళ్లు విఫలమయ్యారు. ఇప్పుడు అగ్రి చట్టాలను అధికారికంగా నోటిపై చేశారు. ఆప్ ప్రభుత్వపు నిజమైన ఉద్దేశ్యం మరియు అనుబంధం బయటపడింది అని అమరీందర్ సింగ్ విమర్శించారు.

## రసాయన విపత్తులు మానవాళి మనుగడకే శాపాలు...!

### (04 డిసెంబరు "రసాయన విపత్తుల నివారణ దినం" సందర్భంగా)

ఇటీవల వైజాగ్ నగర శివారు ఆర్ ఆర్ వెంకటాపురం గ్రామంలో 07 మే 2020 రోజు వేకువ జామున యల్‌జి పాలిమర్స్ పరిశ్రమ జరిగిన 'స్టయరీన్ మోనోమర్' విష వాయువు లీకు కావడంతో 12 మంది చనిపోవడం, వెయ్యికి పైగా సామాన్య ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురికావడం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా మానవాళి విస్మయానికి గురిచేసి, పారిశ్రామిక చరిత్రలో చీకటి రోజుగా నిలిచిన కాళ రాత్రిగా 03 డిసెంబర్ 1984 నిలిచింది, మనసులను పిండేసింది. భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ పెస్టిసైడ్ ప్లాంట్ నుంచి లీకైన 'మిక్ (మిథైల్ ఐసోసయనేట్) విష వాయువు' కారణంగా 20,000 వరకు ప్రజలు అకారణంగా మరణించడం మరియు దాదాపు 5.6 లక్షల జనులు శ్వాసకోశ, నరాల, మానసిక, పిల్లల మరియు కంటి జబ్బులకు లోనైనారు. ఒక రసాయన పరిశ్రమ నుంచి విష వాయువులు అనుకోకుండా విడుదల, విస్పొటనం లేదా మంటలు రావడంతో సకల జీవులు ప్రాణాపాయ దుష్ప్రభావానికి గురికావడాన్ని 'రసాయన విపత్తు'గా అర్థం చేసుకోవాలి. విశ్వవ్యాప్తంగా అనేక భయంకర, విధ్వంసకర రసాయన విపత్తులు చరిత్రలో సాక్షిభూతాలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి రసాయన దుర్ఘటనలను నివారించడానికి మరియు ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతియేటా 04 డిసెంబరు రోజున "రసాయన విపత్తు నివారణ దినం" పాటించిన జరుగుతోంది.

అతి విధ్వంసకర ప్రపంచ రసాయన విపత్తుల్లో 1957లో విండ్‌స్కేల్ రియాక్టర్ నుంచి అదుపు చేయలేని మంటలు, 1907 యూయస్ చిలీలో మోనోగాహ్ గనుల్లో దుర్ఘటన, 1979లో యూయస్‌లోని త్రీ మైల్ ద్వీపంలో అణురియాక్టర్ దుర్ఘటన, 2011లో జపాన్ ఫుకుషిమాలో భూకంపంతో అణు దుర్ఘటన, 2010లో యూయస్ డీప్ వాటర్ హ్వారిజాన్ విస్పొటనలో ఆయిల్ లీకేజ్ లాంటి అనేక రసాయన విపత్తు దుర్ఘటనల్లో ప్రజలు, పర్యావరణం, సకల జీవులు విష ప్రభావానికి లోనై ప్రాణాలు కూడా కోల్పోవడం విచారకరం. భారతదేశ చరిత్రలో కూడా పలు సందర్భాలలో భయంకర విష వాయు దుర్ఘటనలు చోటు చేసుకోవాలి. 1984 భోపాల్ వాయు దుర్ఘటన మరియు 2020 వైజాగ్ స్టయరిన్ వాయు లీకేజ్ దుర్ఘటనలతో పాటుగా 1944 బాంబే డాక్స్ విస్పొటనం, 1975 ఝూర్ఖండ్ చస్నాలా మైనింగ్ దుర్ఘటన, ఛత్తీస్‌ఘడ్ కోర్బా చిమ్నీ దుర్ఘటన, 2009 రాజస్థాన్ ఆయిల్ డిపో మంటలు, 2017 యూపీ యన్‌టిపిసి పవర్ ప్లాంట్ విస్పొటనం, 2010 మాయాపురి రేడియోలాజికల్ దుర్ఘటన,2013 వైజాగ్ హెచ్‌పిసియల్ రిఫైనరీ విస్పొటనం, 2014 నాగారం గేయిల్ పైప్‌లైన్ విస్పొటనం, 2014 బిలాయ్ స్టీల్ ప్లాంట్ వాయు లీకేజ్, 2017 కాన్పూర్ అమోనియా వాయు లీకేజ్, 2017 బెలూర్ క్లోరిన్ వాయు లీకేజి లాంటి ఘటనలు జరగడం వల్ల అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవడం, పర్యావరణానికి విఘాతం కలగడం చేదు అనుభవంగా నిలిచాయి.

పారిశ్రామిక రసాయన విపత్తులు ఉద్దేశ్యపూర్వకంగా, యాజమాన్య నిర్లక్ష్యం లేదా ఉద్యోగుల సోమరితనం కారణంగా జరిగినా ఫలితం అనుభవించేది సాధారణ పౌరులు మాత్రమే. ఇలాంటి దుర్ఘటనల నివారణకు ప్రభుత్వాలు, పరిశ్రమల యాజమాన్యాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ రసాయన ప్లాంట్లలో తరుచుగా భద్రతా చర్యలను సమీక్షిస్తూ, తగు జాగ్రత్తలు పాటించడం నియమంగా తీసుకోవాలి. నిర్లక్ష్యానికి భారీ మూల్యాలు వసూలు చేయడం, పాడుబడిన యంత్రాలు/రసాయనాలు నిలువ చేసే టాంకులను మార్చడం మరియు చట్టాలను కఠినంగా అమలు చేయడం అలవాటుగా మారాలి. రసాయన విపత్తుల నివారణకు సంబంధించిన విస్పొటన చట్టం-1884 - పెట్రోలియం చట్టం-1934, ఫాక్టరీ చట్టం-1948-కీటకనాశిని చట్టం-1968, పర్యావరణ రక్షణ చట్టం-1986- మోటారు వాహన చట్టం-1988, పబ్లిక్ లయబులిటీ ఇన్సురెన్స్ చట్టం-1991-విపత్తు నిర్వహణ చట్టం-2005 లాంటి అనేక చట్టాలు భారత ప్రభుత్వం తీసుకురావడం జరిగింది. చట్టాలు ఎన్ని చేసినా పరిశ్రమల యాజమాన్యాలపైననే అధిక బాధ్యత ఉంటుంది. రసాయనానికి వివక్ష ఉండదు. అణువు విష ప్రభావం అన్ని జీవులకు సమానమే. రసాయన దుర్ఘటనకు సకల జీవులు ప్రాణాలు అర్పించవలసిందే. నివారించదగిన దుర్ఘటనలను జరుగకుండా జాగ్రత్త పడడం మరియు రసాయన ప్లాంట్ పరిసరాల్లో మానవ నివాసాలు లేకుండా చూసుకోవడం మనందరి బాధ్యత. విష వాయువుల లీకేజీలను అరికట్టేందుకు, యాజమాన్యాల విష ఆలోచనలను ఆదిలోనే తుంచి వేయాలి. రసాయన విపత్తు నియంత్రణకు పటిష్ట యంత్రాంగాన్ని సమాయత్తం చేద్దాం. భరతజాతి అంతా హరిత మరియు పారిశ్రామిక విప్లవాలతో సర్వతోముఖాభివృద్ధి దిశలో పయనించాలని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయం సాధ్యమేనా?

### లెఫ్ట్ పార్టీలు ముందునుంచీ వ్యతిరేకమే
### అమెరికాకు మనకూ తేడా ఎంతో ఉంది

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): జమిలి ఎన్నికలపై మనదేశంలో ఏకాభిప్రాయం వస్తుందని అనుకోవడానికి లేదు. ఈ విషయంలో లెఫ్ట్ పార్టీలు ముందునుంచీ వ్యతిరేకిస్తున్నాయి. చట్టప్రకారం ముందుకు సాగితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరక్క పోవచ్చని రాజకీయ నిపుణులు అంటున్నారు. అన్నిటికీ అమెరికాతో పోల్చుకోవడం మనకున్న అలవాటు. అది చిరకాలంగా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్న దేశమైతే...మనది ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. అక్కడ జమిలి ఎన్నికలు లేకపోయినా మనతో పోలిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ మెరుగ్గా వుంది. నాలుగేళ్లకొకసారి అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి. మధ్యలో రెండేళ్లకోమారు ప్రతినిధుల సభకు ఎన్నికలుంటాయి. ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు కూడా ఆ మాదిరే వుంటాయి. పైగా రాష్ట్రాల మధ్య ఎన్నికల నిబంధనల్లో, నిర్వహణలో ఎన్నో వ్యత్యాసాలుంటాయి. అయితే అధ్యక్ష ఎన్నికల కోసం అన్ని రాష్ట్రాలు ఏకమవుతాయి. మన దగ్గర ఫెడరల్ వ్యవస్థ నానాటికీ కుంచించుకు పోతుంటే అక్కడ అది నిరంతరాయంగా వర్ధిల్లుతోంది. భిన్న సమయాల్లో ఎన్నికల వల్ల అభివృద్ధి కార్యకలాపాలకు అక్కడ కలగని విఘాతం మన దేశంలో ఎందుకు కలుగుతోందని లెఫ్ట్ నేతలు జమిలి ఎన్నికల ప్రస్తావన సందర్భంగా ప్రశ్నిస్తున్నారు. పాలకులు అంగీకరించకున్నా.. ఎన్నికల వల్ల విధాన సంబంధమైన కఠిన నిర్ణయాలు తీసుకోవడం వారికి సమస్యగా పరిణమిస్తోంది. ఒక రాష్ట్రంలో ఎన్నికలయ్యాక తీసుకునే విధాన నిర్ణయం మరో రాష్ట్రంలో జరిగే ఎన్నికలకు గుదిబండగా మారుతోంది. అయితే ప్రజలెదుర్కొంటున్న సమస్య వేరు. ఎప్పుడూ జరిగే ఎన్నికల వల్ల అనవసర ఉద్రిక్తతలు పెరుగు తున్నాయి. నేతలు ఒకరిపై ఒకరు నవాళ్లు విసురుకోవడం, వ్యక్తిగత దూషణలకు దిగడం, పర్యవ సానంగా శాంతిభద్రతల సమస్య తలెత్తడం సాధారణ ప్రజానీకానికి సమస్యగా మారుతోంది. అలాగే ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలతో మేనిఫెస్టోలు ప్రచురించి ప్రజలను ఫూల్స్ చేస్తున్నారు. డబ్బు, మద్యం పంపిణీ వంటివి సరేసరి. ఇవన్నీ ఎన్నికలను జాతరగా మారుస్తుంటే... ఆ తర్వాత ఏర్పడే చట్టసభలు సైతం కర్తవ్యనిర్వహణ లో విఫలమవుతున్నాయి. ఎంతో కీలకమైన బిల్లులనుకున్నవి కూడా అరకొర చర్చలతో ఆమోదం పొందు తున్నాయి. కొన్నిసార్లు గిలెటిన్లతో ముగుస్తున్నాయి. వాగ్దానాలు నెరవేర్చని పాలకులపై ఏవిధమైన చర్యలూ తీసుకునే అవకాశమే లేదు. ఈ దుస్థితిని మార్చడానికి పాలకులు ముందుగా ప్రయత్నించాలి. జాతీయ అంశాలు ప్రధానంగా చర్చకొచ్చే లోక్‌సభ ఎన్నికలతో అసెంబ్లీలను జోడిస్తే స్థానిక ఆకాంక్షలు, సమస్యలు మరుగున పడతాయి. అయితే సందర్భంను అనుసరించి శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు ఎన్నో కీలకాంశాలను నేర్చుకొని మరింత బలపడ్డాయని గుర్తించాలి. ఈ మూడు వ్యవస్థలపై 130 కోట్ల మంది భారతీయులకు ఉన్న విశ్వాసం కారణంగానే ఇది సాధ్యమైంది. మన రాజ్యాంగం అందించిన బలం కష్ట సమయంలోనూ సమాధానం చూపుతోంది. వాడుకలో లేని చట్టాలను తొలగించే పక్రియతో పాటు పాత చట్టాలను సవరించేటప్పుడు వాటిని రద్దు చేసే వ్యవస్థ ఉండాలి. ప్రతి పౌరుడికీ మన రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉంటే మీరి మంచిది. ఈ క్రమంలో ఒకవేళ అధికారంలో వున్నవారు మెజారిటీ కోల్పోయి, ఏ పార్టీ కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని పరిస్థితి ఏర్పడితే అక్కడి అసెంబ్లీ ఏమవుతుందన్న దానికి సమాధానం కనుక్కోవాలి. ముందుగా వరుస చర్చలతో జమిలిపై ఓ నిర్ధారణకు రావాల్సి ఉందని రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## నిరంతర ప్రయత్నంతో లక్ష్యాన్ని సాధించవచ్చు

### -పోలీస్ నియామక శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి హరీష్



సిద్దిపేట,డిసెంబర3(ఆర్ఎన్ఎ): అసాధ్యమంటూ ఏదీ లేదని.. ఆత్మ విశ్వాసంతో ఏదైనా సాధించొచ్చని మంత్రి హరీశ్ రావు అన్నారు. నిరంతర ప్రయత్నం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలీసు నియామక ఉచిత శిక్షణా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 34 ఉచిత పోలీస్ శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో 2015 నుంచి పోలీస్ ఉద్యోగాలతో పాటు ఇతర ఉద్యోగాలకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన చాలా మంది ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు. రాష్ట్ర స్థాయి ఉద్యోగాలే కాకుండా జాతీయ స్థాయిలో వచ్చే ఉద్యోగాలకు కూడా ప్రయత్నించాలని సూచించారు. శిక్షణకు క్రమం తప్పకుండా హాజరైతే స్టడీ మెటీరియల్‌తోపాటు, టిఫిన్, స్పోర్ట్స్ మెటీరియల్, యూనిఫాం తదితర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. విద్యార్థులు నిర్లక్ష్యం చేయ కుండా, మంచి సాధనతో ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

## ఘనంగా వికలాంగుల దినోత్సవ వేడుకులు




రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ ,వీహెచ్ పీ ఎస్ ఆధ్వర్యంలో లో ప్రపంచ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు గుండ థామస్ మాదిగ మాట్లాడుతూ వికలాంగులకు ఉచితంగా డబల్ బెడ్ బెడ్ రూములు కట్టి ఇవ్వాలని ఉచితంగా బస్సు ఇవ్వాలని అర్హులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని రాజకీయాలలో వాట కల్పించాలని వారికి ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని పూర్తిస్థాయి గా ప్రభుత్వమే వారిని ఆదుకోవాలని థామస్ డిమాండ్ చేశారు ఇట్టి కార్యక్రమంలో వీహెచ్ పీ ఎస్ జిల్లా కన్వీనర్ జోగం తిరుపతి కో కన్వీనర్ తలారి సురేష్ గాలయ్యఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకులు అవును ప్రభాకర్ ,ఆవునూరు లచ్చన్న, మేకల లక్ష్మణ్, తాండ్ర తిరుపతి, నేదురి నరసయ్య ,ఎదల్లి నాగరాజు, ఎమ్ ఎస్ ఎఫ్ జిల్లా కన్వీనర్ సుంకా పాక దామోదర్ వినయ్ లింగయ్య నరసయ్య హనుమయ్య మరియు తదితరులు పాల్గొన్నారు

## 'లవ్ జిహాద్' నిషేధానికి చట్టం తెస్తాం : కర్ణాటక హోంమంత్రి

బెంగళూర్, డిసెంబర్ 3: లవ్ జిహాద్ నిషేధానికి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకురాబోతుందని కర్ణాటక హోంశాఖ మంత్రి బసవరాజు బొమ్మయ్ గురువారం స్పష్టంచేశారు. ఇటీవలే యూపీ ప్రభుత్వం లవ్ జిహాద్‌పై నిషేధం విధిస్తూ ఆర్డినెన్స్ జారీ చేసిందని, అందులోని అన్నివిషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఏ విధంగా చట్టాన్ని అమలు చేస్తున్నారో అధ్యాయనం చేసిన తరువాత ఇక్కడా అమలు చేస్తామని పేర్కొన్నారు. మొఘల్ కాలం నుంచి హిందు-ముస్లింలు మతాంతర వివాహాలు చేసుకుంటున్నారని ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సిద్ధరామయ్య ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు.

సిద్ధరామయ్య ఇంకా యొఘలుల కాలంలోనే ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇదిలాఉండగా కర్ణాటక న్యాయశాఖ మంత్రి మధుస్వామి చిక్‌మంగళూర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. లవ్ జిహాద్ నిషేధ చట్టం ప్రతిపాదన తనశాఖ వద్దకు రాలేదని, ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి చర్చా జరగలేదని అన్నారు. స్క్రూటీనీ కమిటీ చైర్మన్‌గా ఉన్న తనవద్దకు అలాంటి ప్రతిపాదనేదీ రాలేదని తెలిపారు. ఎలాంటి చట్టాన్ని తీసుకురాన్నప్పుడు ఏం చర్చించమంటారని విలేకరులను ఆయన ఎదురు ప్రశ్నించారు.

## గిల్గిత్ బాల్టిస్తాన్‌కు తాత్కాలిక ప్రాంతీయ హూదా

### పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): పాకిస్తాన్ తెహ్రీక్‌ఏ÷-ఖఇ÷-ఖన్సాఫ్ ప్రభుత్వం గిల్గిత్ బాల్టిస్తాన్‌కు తాత్కాలిక ప్రావిన్షియల్ హూదాను ముందుగా వాగ్దానం చేసినట్లు ప్రాధాన్యత ప్రాతిపదికన ఇస్తున్నట్లు పాకిస్తాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. గిల్గిత్ బాల్టిస్తాన్ త్వరలో ఈ ప్రాంతంలో కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేసే ప్రభుత్వాన్ని పొందుతుందని ఆయన బుధవారం తెలిపారు. కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఇమ్రాన్‌ఖాన్ ఈ ప్రాంత అభివద్ధికి తన ప్రణాళికలను వివరించారని జియో టీవీ నివేదించింది. ఇమ్రాన్‌ఖాన్ గిల్గిత్ బాల్టిస్తాన్‌లో అధికారికంగా పర్యటిస్తున్నారు. ముఖ్యమంత్రి ఖలీద్ ఖుర్షీద్‌తోపాటు ఆయన మంత్రిమండలికి ఇమ్రాన్‌ఖాన్ అభినందనలు తెలుపుతూ.. ప్రజలకు సేవ చేయడం కర్తవ్యంగా భావించాలని సూచించారు. 'ఇక్కడి ప్రాంతం, ఇక్కడి సమస్యలు నాకు తెలుసు. త్వరలోనే అన్ని పరిష్కారం అవుతాయి. గిల్గిట్‌లో ఏ ప్రాజెక్టులు అవసరమో మా కాన్నా మీకే బాగా తెలుసు' అని ఇమ్రాన్ ఖాన్ చెప్పారు. ఎహ్సాస్ కార్యక్రమాన్ని కూడా తీసుకురావడానికి తమ ప్రభుత్వం కషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. రూ. మిలియన్ పరిమితి వరకు ఏ దవాఖానలోనైనా చికిత్స పొందడానికి ప్రజలు దీనిని ఉపయోగించుకునేందుకు వీలుగా పీఎం సార్వత్రిక ఆరోగ్య బీమా వాగ్దానం చేశారు. ఎన్నికలకు ముందు నవంబర్ 1 న చేసిన పర్యటనలో, గిల్గిత్ బాల్టిస్తాన్‌కు తాత్కాలిక ప్రాంతీయ హూదాను మంజూరు చేయనున్నట్లు ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు.

## శశికళ జైలు శిక్షలో కుదింపు..!

### జనవరి 27న ఆమె విడుదలయ్యే అవకాశం

చెన్నై,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): అక్రమార్జన కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న శశికళ.. తనను ముందస్తుగా విడుదల చేయాలని అభ్యర్థించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవలే ప్రత్యేక కోర్టుకు రూ. 10 కోట్ల జరిమానా చెల్లించారు శశికళ. వచ్చే ఏడాది జనవరి 27న ఆమె విడుదలయ్యే అవకాశం ఉందని ఇదివరకే అధికారులు స్పష్టం చేశారు. అయితే అంతకుముందే తనను విడుదల చేయాలని కోరినట్లు శశికళ సన్నిహిత వర్గాలు తెలిపాయి. శశికళ అభ్యర్థనను జైలు శాఖ వర్గాలు ఉన్నతాధికారులకు పంపించినట్లు వెల్లడించాయి. ఈ విన్నపంపై అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశాయి.జైలు నిబంధనల ప్రకారం కారాగారంలో సత్ప్రవర్తనతో మెలిగితే.. శిక్షలో ప్రతి నెల మూడు రోజుల మినహాయింపు లభిస్తుంది. ఈ ప్రకారం శశికళకు విధించిన శిక్షలో 135 రోజులు తగ్గే అవకాశం ఉంటుంది. ఈ కేసులో శశికళతో పాటు తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత కూడా ఉన్నారు. ఇందులో జయలలితకు రూ.100 కోట్లు, శశికళ సహా మరో ఇద్దరికి రూ.10 కోట్ల చొప్పున జరిమానా విధిస్తూ 2014 సెప్టెంబర్?లో ట్రయల్? కోర్టు తీర్పునిచ్చింది. జయలలిత మరణంతో ఆమెపై ఉన్న అప్పీలు రద్దైంది.

# ఫైజర్ టీకాకు బ్రిటన్ గ్రీన్ సిగ్నల్!

## వచ్చే వారం నుంచి బ్రిటన్‌లో టీకా పంపిణీ

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): కరోనాపై విజయం సాధించేందుకు అడుగుదూరంలో ప్రపంచం నిలిచింది. కరోనా నియంత్రణకు వ్యాక్సిన్ వచ్చే వారం నుంచి అందుబాటులోకి రానుంది. ఫైజర్‌బ్యోఎన్‌టెక్ కరోనా వైరస్ వ్యాక్సిన్ వినియోగానికి బ్రిటన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రపంచంలోనే తొలిసారి వచ్చే వారంలోనే ఈ వ్యాక్సిన్ అందుబాటులోకి రానుంది.

ఫైజర్‌బ్యోఎన్‌టెక్ కరోనా వైరస్ వ్యాక్సిన్ వినియోగానికి అనుమతించాలని మెడిసిన్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రోడక్ట్స్ రెగ్యులేటరీ ఏజెన్సీ (ఎంహెచ్ఆర్ఏ) చేసిన సిఫారసును బ్రిటన్ ప్రభుత్వం ఆమోదించింది. యునైటెడ్ కింగ్‌డమ్ వ్యాప్తంగా వచ్చే వారం నుంచే ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని బ్రిటన్ ప్రభుత్వం వెల్లడించింది. వ్యాక్సిన్ వినియోగానికి అనుమతి సాధించడంపై ఫైజర్ సీఈవో ఆల్బర్ట్ బౌర్లా సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరించిన ఎంహెచ్ఆర్ఏకు ఆయన కతజ్ఞతలు తెలిపారు.

తాము మరిన్ని దేశాల అనుమతుల కోసం ఎదురు చూస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ నాణ్యత ఉన్న వ్యాక్సిన్‌లను అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే బ్రిటన్‌లోని ఆసుపత్రులన్నీ వ్యాక్సిన్ అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని, వచ్చే వారంలోనే ఈ కార్యక్రమం మొదలవుతుందని బ్రిటన్ ఆరోగ్యశాఖ మంత్రి మ్యాట్ హ్యాన్‌కాక్ చెప్పారు. ముందుగా వైద్య సిబ్బంది, కొవిడ్ ప్రమాదం ఎక్కువగా ఉన్న వద్ధులకు ఫైజర్ వ్యాక్సిన్ ఇవ్వనున్నారు. ఇప్పటికే బ్రిటన్ 4 కోట్ల వ్యాక్సిన్‌లను ఆర్డర్ చేసింది.

వీటిని 2 కోట్ల మందికి ఒక్కొక్కరికి రెరడు డోసుల చొప్పున ఇవ్వాలని నిర్ణయించారు. ఫైజర్ కేవలం పది నెలల్లోనే వ్యాక్సిన్‌ను తయారు చేసి, ప్రయోగాలు నిర్వహించి, అనుమతులు సాధించడం విశేషం. సాధారణంగా దీనికి దశాబ్దాల సమయం కూడా పడుతుంది. అయితే ఇది లైవ్ లోకి వచ్చిన తర్వాత దీని ఫలితం ఎలా ఉంటుందో వేచి చూడాలి. కరోనా వైరస్ చైనా నుంచే వ్యాప్తి చెందిందని ప్రపంచమంతా నమ్ముతుండగా అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్(సీడీసీ) ఇచ్చిన రిపోర్టు ఇందుకు బిన్నంగా ఉంది. సీడీసీ... కరోనాకు సంబంధించిన ఒక కొత్త విషయాన్ని వెల్లడించింది. కరోనా మహమ్మారి గత ఏడాది డిసెంబరులోనే అమెరికాలో వ్యాప్తిచెందిందని తెలిపింది. ఇంతకాలం అమెరికా... ఈ కరోనా వైరస్‌కు చైనానే కారణమని ఆరోపిస్తూవస్తోంది. అయితే సీడీసీ తెలిపిన ఈ వివరాలతో చైనా, అమెరికాల మధ్య మరో వివాదం చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీడీసీ ఈ అధ్యయనం కోసం రెడ్‌క్రాస్ సాయంతో 7,389 బ్లడ్ శాంపిల్స్ కలెక్ట్ చేసి, పలు పరిశోధనలు నిర్వహించింది. ఈ శాంపిల్స్‌లోని 106 నమూనాలలో వైరస్ కనుగొన్నారు.

# దళిత, గిరిజనులకు ఉచిత న్యాయం

## దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

నల్లగొండ,డిసెంబరు3(ఆర్ఎన్ఎ): సీమాంధ్రుల పాలనలో రాష్ట్ర రాజధానికే పరిమితమైన ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను తెలంగాణ రాష్ట్రంలో దళిత, గిరిజనుల గడప వద్దకు చేర్చి వారికి ఉచితంగా న్యాయం అందించడం ద్వారా దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని జడ్పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో 10,500 కేసులు పెండింగ్‌లో ఉంటే 8 వేలకు పైగా కేసులను పరిష్కరించి రూ. 55.64 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందించి వారిలో భరోసా నింపిందన్నారు.

పీసీఆర్, పీఓటీ యాక్టులను గతంలో పట్టించుకోలేదని, తెలంగాణ ఏర్పాటయ్యాక వాటిని బలోపేతం చేసి, బాధితులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 12వేల గ్రామాల్లో సివిల్ రైట్స్ దినోత్సవాలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలు 29 జిల్లాలో ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి జిల్లాలో రివ్యూ నిర్వహించి అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. 57 కోర్టు కేసులు హియరింగ్ చేసి 85 శాతం న్యాయం చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఖమ్మ, కొత్తగూడెం, గద్వాల, అలంపూర్ జిల్లాల్లో జన అదాలత్‌ల ద్వారా ఎస్సీ, ఎస్టీ కేసులు పరిష్కరించి బాధితులకు న్యాయం చేసినట్లు తెలిపారు. దళిత, గిరిజనులకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా న్యాయసహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీటిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యుడు విద్యాసాగర్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు ఉన్నారు.

# రైతులను అనుమానించి అవమానిస్తారా?

## -కేంద్రమంత్రి వికె సింగ్‌పై సూర్జెవాలా మండిపాటు

న్యూఢిల్లీ,డిసెంబరు3(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న రైతుల బృందంలో ఎక్కువ మంది రైతులు లేరు అని వ్యాఖ్యానించిన కేంద్ర మంత్రి వీకే సింగ్‌ను తక్షణమే కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. వీకే సింగ్ వ్యాఖ్యలు ఇబ్బందికరంగా ఉండటమే కాకుండా అవమానకరంగా ఉన్నాయని కాంగ్రెస్ మీడియా సెల్ చీఫ్ రణ్‌దీప్ సింగ్ సూర్జెవాలా పేర్కొన్నారు. ప్రధాని మోదీ మంత్రుల భాష, ప్రవర్తన ఇంత ఇబ్బందికరంగా, అవమానకరంగా ఉన్నది. రైతులు ఇప్పుడు ప్రభుత్వం నుంచి రైతు అని సర్టిఫికేట్ తీసుకొని ఆందోళనలో పాల్గొనాలా? అని సూర్జెవాలా ట్వీట్‌లో విచారం వ్యక్తం చేశారు. ఇది రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా బీజేపీ దుష్ట ఉద్దేశానికి సజీవ ఉదాహరణ. అలాంటి మంత్రులను మంత్రిమండలి నుంచి తొలగించడం భావ్యం అని ఆయన చెప్పారు. పార్లమెంటు సభ్యుడు, రిపున్ బోరా కూడా కేంద్ర మంత్రి వీకే సింగ్ వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. రైతులు నిరసన వ్యక్తం చేయడాన్ని తాను చూడలేదని వీకే సింగ్ చెప్పడం ఆందోళన చేస్తున్న రైతులను అవమానించడమే. ఇలాంటి వారు కేంద్ర మంత్రిమండలిలో ఉండటం మన దురదృష్టకరమని రిపున్ బోరా చెప్పారు. మంగళవారం కేంద్ర మంత్రి వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ఫొటోలలో చాలా మంది రైతులుగా కనిపించడం లేదు. రైతుల పేరును అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు ఆడుతున్న నాటకం మాదిరిగా కనిపిస్తున్నదని వ్యాఖ్యానించారు.

# ఆర్థిక సహాయం అందాలంటే కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలి- హ్యాకర్ల కొత్త పంథా

### బాధితులను ఆసరాగా తీసుకుని మోసం చేస్తున్న హ్యాకర్లు లా కొత్త దందా

### తస్మాత్ జాగ్రత్త - టౌన్ సీఐ వెంకటేష్

రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి):ఆర్థిక సహాయం కోసం సోషల్ మీడియా లో పోస్ట్ చేసిన వారిని ఆసరాగా చేసుకొని మీకు అమౌంట్ అప్రూవల్ అయ్యాయి అవి మీకు అందాలి అంటే మీరు కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలి అని హ్యాకర్లు కొత్త పంథా లో బాధితుల ను ఆసరా చేసుకొని మోసం చేస్తున్నారు. వేములవాడ గాంధీ నగర్ కు చెందిన ఎండ్. సాబీల్ గత 3సంవత్సరాలనుండి కిడ్నీ సంబందిత వ్యాధి తో బాధపడుచున్నాను నాకు ఆర్థిక సహాయం చేయండి అని సోషల్ మీడియా ద్వారా సోను సూద్ కు పోస్ట్ చేయగా,గత మూడు రోజుల నుండి మెయిల్ శ్రీ, ఫోన్ ద్వారా మీకు సోను సూద్ గారి ద్వారా 10లక్షలు అప్రూవల్ అయ్యాయి దీని కోసం రూపాయలు 12,500/- అకౌంట్ లో వెయ్యాలి అని అకౌంట్ నెంబర్ పంపగా అట్టి అకౌంట్ నంబర్ గురించి ఆరా తీయగా నకిలీ అకౌంట్ అని తెలిసినది. ఈ విషయం పై పట్టణ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ మాట్లాడుతూ ఇటీవల హ్యాకర్లు డబ్బుల కోసం ఇలాంటి మార్గాలను ఎంచుకుంటున్నారు అని, వాట్సాప్, పేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలలో ఫేక్ అకౌంట్ లు, ఫేక్ న్యూస్ లు చూసి ప్రజలు మోస పోవద్దు అని తెలిపారు. అపరిచితులు ఫోన్ చేసి ఓ టీపీ అడిగిన చెప్పవద్దు అని ప్రజలు ఇలాంటి వారి పట్ల జాగ్రత్త గా ఉండాలి అని వారి చేతిలో మోస పోవద్దు అని తెలిపారు.


Gmail

Fwd: Cheque issue
1 message

ANAS SHOAIB <mohdsabeel155@gmail.com>
To: ramstseva@gmail.com

---------- Forwarded message ---------
From: Sonu Sood <sonusoodfoundation9@gmail.com>
Date: Thu, Nov 26, 2020, 11:36 AM
Subject: Cheque issue
To: <mohdsabeel155@gmail.com>

The amount of the total amount of 10,00000 approved by AAP under the notification application through Sonu Sood Foundation Team Kolkata was checked by Mr. Subodh Patel



# దళారుల ప్రమేయం లేకుండా కొనుగోళ్లు

## పక్కాగా చర్యలు తీసుకున్న పౌరసరఫరాల అధికారులు

ఖమ్మం,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): ఈ వానకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పూర్తి ఏర్పాట్లు చేసింది. రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో పలు సూచనలు చేసింది. గ్రామాల్లో రైతులను చైతన్యవంతం చేసేందుకు మద్దతు ధర కొనుగోలుకు నిర్ధేశించిన ప్రమాణాలను కరపత్రాల ప్రచారం చేశారు. మరోవైపు గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులు కాంటాలు పెట్టి ప్రజలను మోసం చేయకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగవద్దని, ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు పడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర స్థాయి అధికారులు పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో 445 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించేందుకు అధికారులు నిర్ణయించారు.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని మహిళా సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజాపంపిణీ అవసరాల దృష్ట్యా పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు కొనుగోళ్లు సాగుతున్నాయి. అలాగే రైతుల ఖాతాల్లో నేరుగా నగదును జమ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రభుత్వం ప్రణాళికను రూపొందించి అమలు చేస్తుంది. పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందించే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. ఏడాది రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 4లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించింది. జిల్లాలో రైతులు ఈ సీజన్‌లో 7లక్షల 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్నాన్ని పండించినట్లుగా అధికారులు అంచనా వేశారు. దీనిలో దాదాపు లక్ష ఎకరాల్లో లావురకం ధాన్యం కాగా మిగిలిన 6లక్షల ఎకరాల్లో సన్నరకం ధాన్యం పండించారు. ప్రభుత్వం ఈ ఏడాది గ్రేడ్ -ఏ రకానికి క్వింటాకు రూ.1888 ధర నిర్ణయించగా, కామన్ రకం ధాన్యానికి రూ.1868గా నిర్ణయించింది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం తరలిస్తున్నారు. ఇక భద్రాద్రి జిల్లాలలోనూ గత ఏడాది వానకాలం ధాన్యం కొనుగోళ్లకు 194 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఈ సారి రికార్డు స్థాయిలో 248 కొనుగోళు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 210 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వమే అన్ని ఏర్పాట్లు చేయడంతో రైతు పండించిన పంట పూర్తి స్థాయిలో సర్కారు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు జరుగుతున్నాయి. గతేడాది వానకాలంలో 1,30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. యాసంగిలో 60,400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఈ ఏడాది 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో మార్కెట్‌లో ధాన్యం ధరలు పెరిగి రైతులకు మేలు కలుగుతుంది. తేమశాతం, చెత్త, ఇతర వాటి శాతం అధికంగా ఉంటే మార్కెట్‌లో విక్రయిస్తున్నా మరీ తక్కువ కాకుండా విక్రయించే పరిస్థితి కేవలం కొనుగోలు కేంద్రాల వల్లే ఏర్పడిందని అంటున్నారు.

# హెచ్‌డిఎఫ్‌సి క్రెడిట్ కార్డుల జారీ నిలిపివేత

## డిజిటల్ బ్యాంకింగ్ సేవల్లో తీవ్ర అంతరాయం

## పరిష్కారం అయ్యేవరకు లావాదేవీల నిలిపివేత

## బ్యాంక్‌కు ఆర్‌బిఐ ఆదేశాలు జారీ

ముంబై,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): కొత్త క్రెడిట్ కార్డులివ్వొద్దని హెచ్ డీఎఫ్ సీ బ్యాంకును ఆర్బీఐ ఆదేశించింది. గత రెండేళ్లుగా హెచ్ డీఎఫ్ సీ ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ వంటి పేమెంట్ సేవలకు అంతరాయం కల్గుతున్నందును ఈ ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకింగ్ డిజిటల్ పేమెంట్స్‌లో లోపాలు ఉన్నందున సవరించే వరకు కొత్త కార్డులు జారీ చేయకూడదని ఆదేశించింది. అంతేగాకుండా హెచ్ డీఎఫ్ సీ క్రెడిట్ కార్డు వినియోగదారులు బిల్లులను సరిగా కట్టడం లేదని గతంలో ఆర్బీఐకి ఫిర్యాదు చేసింది. నవంబర్ 21న బ్యాంక్ ప్రైమరీ డేటా సెంటర్లో విద్యుత్ నిలిచిపోవడంతో డిజిటల్ పేమెంట్స్ ఆగిపోయాయని..అందుకే ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసిందని హెచ్ డీఎఫ్ సీ తెలిపింది. కస్టమర్ల సమస్యలను పరిష్కరించి వారికి జవాబుదారితనంగా ఉండాలని బ్యాంకు బోర్డుకు తెలిపింది. ఈ మేరకు ప్రముఖ ప్రైవేటు రంగానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిజిటల్ కార్య కలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. బ్యాంకుకు చెందిన డాటా సెంటర్‌లో గత నెల చోటుచేసుకున్న అంతరాయం నేపథ్యంలో ఈ చర్యలను తీసుకున్నట్టు తెలిసింది. ఈ ఆదేశాలతో బ్యాంకు నూతన క్రెడిట్ కార్డుల జారీకి కూడా బ్రేక్ పడింది. గత రెండు సంవత్సరాలుగా హెచ్‌డీఎఫ్‌సీకి సంబంధించిన ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, చెల్లింపులు తదితర కార్యకలాపాల్లో అంతరాయాలు చోటుచేసుకొంటున్నాయి. తాజాగా నవంబర్ 21న బ్యాంకు ప్రైమరీ డాటా సెంటర్‌లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవటంతో ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, చెల్లింపుల్లో ఆటంకాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో ఆర్బీఐ తాజా ఆదేశాలు జారీచేసిందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వివరించింది. బ్యాంకు డిజిటల్ 2.0 కార్యక్రమంతో సహా ఇతర ఐటీ అప్లికేషన్ల పరిధిలోకి వచ్చే అన్ని కార్యకలాపాలు, నూతన క్రెడిట్ కార్డుల జారీని ప్రస్తుతానికి నిలిపివేయవలసిందిగా ఆర్బీఐ తన ఆదేశాల్లో పేర్కొంది. కాగా, పరిస్థితిని చక్కదిద్దేందుకు తాము పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వెల్లడించింది.

# నిర్మల్ పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

## హైడ్రాలిక్ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి

నిర్మల్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): నిర్మల్ పురపాలక శాఖ ఆధ్వర్యంలో నూతనంగా కొనుగోలు చేసిన హైడ్రాలిక్ మౌంటెడ్ లాడర్ వాహనాన్ని గురువారం దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. నిర్మల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన నిర్మల్ జిల్లా కేంద్రంలో 4 వైపులా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 14 జంక్షన్‌లో హైమాస్ట్ లైటింగ్‌ను సైతం ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. కాగా, లైటింగ్ సిస్టానికి ఏదైనా సాంకేతిక పరంగా ఇబ్బందులు వస్తే క్రేన్ సహాయంతో రిపేర్ చేసేవారని, ఇప్పుడు ఈ వాహనం వల్ల వేగంగా తక్కువ వ్యవధిలోనే లైటింగ్‌ను రిపేర్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. పురాతన కోట శ్యామ్ ఘర్ కోటను పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. తద్వారా పట్టణంలో విద్యుత్ స్థంబాలతో సమస్యలు ఉండవన్నారు. రూ.35 లక్షలతో కోట చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేశామని వివరాలను వెల్లడించారు. దీంతో నిర్మల్‌కు కొత్త శోభ వచ్చిందన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాం రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ పట్టణంలో హైడ్రాలిక్ వెహికల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

# వరదబాధిత రైతులను తక్షణం ఆదుకోవాలి

## కౌలు రైతులకు తక్షణ సాయంగా పదివేలు అందించాలి

## వరదబాధిత రైతులను పరామర్శించిన పవన్ కళ్యాణ్

## పరిహారం అందించకుంటే న్యాయం జరిగే వరకు పోరాడుతా

విజయవాడ,డిసెంబర్2(ఆర్ఎన్ఎ): కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదని జనసేనాని పవన్ కళ్యాణ్ మండిపడ్డారు. పొలం యజమానులతో సమానంగా వారికీ పరిహారం అందించాలన్నారు. 48 గంటల్లోగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు తక్షణ సాయం కింద రూ.10వేలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు పరిహారం పెంచకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రైతులకు అండగా ఉంటామని.. వారికి న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగిస్తామని రైతులకు పవన్ భరోసా కల్పించారు. నివర్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కలిశారు. పామర్రు నియోజకవర్గంలో పంట పొలాలను పవన్ పరిశీలించారు. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను ఆయన ఓదార్చారు. తుఫాన్ ప్రభావం రైతులను నట్టేట ముంచింది. చేతికొచ్చిన పంట చేజా రిపోవడం బాధాకరం అన్నారు. రైతులకు అండగా మేం ఉన్నాం. అందుకే వారిని కలవడానికి వచ్చా. ప్రకృతి వైపరీత్యాల పై రాజకీయం చేయబోం. నేను ఓట్ల సమయంలో వచ్చి వెళ్లే వ్యక్తిని కానని అన్నారు. ఇప్పుడు ఎన్నికలు లేవు. క్షేత్ర స్థాయిలో ప్రజల బాధలను తెలుసుకునేందుకే వచ్చా. కష్టపడి పండించిన పంట మొత్తం దెబ్బతింది. సొంతభూమి రైతులతోపాటు కౌలు రైతులకూ న్యాయం జరగాలన్నారు. రైతుల కన్నీళ్లు దేశానికి మంచిది కాదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతాంగాన్ని ఆదుకోవాలి. కర్షకుల కష్టాలు, కన్నీళ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా' అని పవన్ పేర్కొన్నారు. వైకాపా పాలనలో రైతులందరికీ న్యాయం జరగడం లేదని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. నివర్ తుపాను బాధిత రైతులను వైకాపా నేతలు కనీసం పరామర్శించలేదని ఆరోపించారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలంలోని పెదప్రో లులో ఆయన నివర్ బాధిత రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వారికి జరి గిన నష్టాన్ని జనసేనానికి వివరించారు. అనంతరం పవన్ అక్కడే మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో వరదలు వచ్చి ఇల్లు మునిగితే బాధితులకు రూ.10వేలు చొప్పున ఇచ్చారని.. ఇక్కడ ఎకరం పొలం మునిగితే ప్రభుత్వం అంతే ఇవ్వడం సరికాదన్నారు. ఆ పరిహారం రైతులకు ఏమాత్రం సరిపోదని చెప్పారు. ఎకరానికి రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పరిహారం అందించాలని పవన్ డిమాండ్ చేశారు. వైకాపా నేతల పుట్టినరోజు వేడుకలకు అడ్డురాని కరోనా.. నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు మాత్రం సాకుగా మారిందని ఆక్షేపించారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మహబూబాబాద్, డిసెంబర్ 3: గత ప్రభుత్వాల కంటే టీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన టీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి టీఆర్ఎస్ కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం భేషజాలకు పోకుండా కృషి చేయాలన్నారు. టీఆర్ఎస్ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు అని గుర్తు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రవేశపెడుతున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం తక్షణ కర్తవ్యంగా పెట్టుకోవాలని సూచించారు. మంత్రి కేటిఆర్ మహబూబాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, మార్నేని వెంకన్న, చిట్యాల జనార్దన్, నాయిని రంజిత్ నాయకులు పాల్గొన్నారు.



# వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు నిరసన

## హర్యానా ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి ర్యాలీ

ఛండీఘడ్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ రైతులు చేస్తోన్న నిరసనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులను పోలీసులు అడ్డుకున్న విషయం తెలిసిందే. తాజాగా పంజాబ్ యువజన కాంగ్రెస్ నేతలు హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఇంటి ముట్టడికి ర్యాలీగా బయల్దేరారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ పోలీసులు వారిపై జలఫిరంగులు ప్రయోగించారు. అనంతరం వారిని నిర్బంధించారు. రైతుల పట్ల హర్యానా ప్రభుత్వం తీరును నిరసిస్తూ.. సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ ఇంటి ముట్టడికి పంజాబ్ యువజన కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో.. ఆయన నివాసానికి 3 కిలోమీటర్ల దూరంలో చండీగఢ్ పోలీసులు భారీగా మోహరించారు. బారికేడ్లను ఉంచారు. అయినప్పటికీ.. కొందరు ఆందోళనకారులు బారికేడ్లను దాటి ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ నేతలపై వాటర్ కెనాన్ల ప్రయోగం చేయగా ఒక్కసారిగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. నిరసనకారులను నియంత్రించేందుకు పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఛలో ఢిల్లీ నిరసన ప్రదర్శనను హరియాణా ప్రభుత్వం అడ్డుకుందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శాంతియుతంగా ర్యాలీగా వెళ్తోన్న తమపై పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించారని.. అందుకు సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# పంజాబ్‌లో రైతుల నిరసనకు సంఘీభావం

## యువజన కాంగ్రెస్ కార్యకర్తల ధర్నా

## పోలీసుల లాఠీఛార్జ్

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులకు సంఘీభావంగా పంజాబ్ లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ధర్నా చేశారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేసి, వాటర్ క్యానన్లను ఉపయోగించారు. హర్యానాలో ఈ పార్టీ కార్యకర్తలు సీఎం మనోహర్ లాల్ ఖట్టర్ నివాసాన్ని ముట్టడించారు. రైతులపై పోలీసుల బలప్రయోగానికి ఆయన క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తాము కూడా ఢిల్లీ వెళ్లి అక్కడ ఆందోళన చేస్తున్న అన్నదాతలతో కలిసి నిరసన ప్రదర్శనల్లో పాల్గొంటామని వారు ప్రకటించారు. కాగా సింఘు బోర్డర్ వద్ద సమావేశం నిర్వహించిన రైతులు తమ ఆందోళనను ఉధతం చేయాలని నిర్ణయించారు. వీరి నిరసన కారణంగా నోయిడాఢిల్లీ సరిహద్దులను పోలీసులు మూసివేశారు.అటు గురువారం కేంద్రంతో మళ్ళీ తాము జరపబోయే చర్చల్లో ఎలాంటి విధానం అనుసరించాలన్న దానిపై బుధవారం అన్నదాతలు తమలో తాము చర్చించుకున్నారు. ఈ రోజు కూడా వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర తోమర్, హూం శాఖ మంత్రి అమిత్ షా సమావేశమై తాజా పరిస్థితిపై చర్చించారు. ఇలా ఉండగా.. ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలకోసం రైతులను తప్పుదారి పట్టిస్తున్నాయని బీజేపీ ఎంపీ వీరేంద్ర సింగ్ సింగ్ మస్త్ ఆరోపించారు. రైతుల్లో కలిగిన అపోహలను తొలగించే బదులు విపక్షాలు వారిని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రేరేపిస్తున్నాయని ఆయన దుయ్యబట్టారు. నిజానికి రైతు చట్టాల వల్ల వారి ఆదాయం పెరుగుతుందని, ఈ విషయాన్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలని ఆయన అన్నారు. వారి ఆటలు సాగబోవని హెచ్చరించారు.

# అమెరికాలో కరోనా విలయం

## ఒక్కరోజే 2500 మందికిపైగా మృతి

వాషింగ్టన్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): అగ్రరాజ్యం అమెరికాలో కరోనా వైరస్ విలయం సష్టిస్తోంది. ప్రతి రోజు రికార్డు స్థాయిలో కొవిడ్ కేసులు వెలుగు చూస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. గడిచిన 24 గంటల్లో అమెరికాలో కొవిడ్ మహమ్మారికి దాదాపు 2500 మందికిపైగా ప్రజలు బలైనట్టు జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడించింది. ఏప్రిల్ తర్వాత ఇంత భారీ స్థాయిలో కరోనా మరణాలు సంభవించడం ఇదే తొలిసారని పేర్కొంది. కాగా.. మంగళవారం రోజు అమెరికాలో కొవిడ్ బారినపడిన వారి సంఖ్య 1.80లక్షలు దాటింది. ఇదిలా ఉంటే.. అమెరికాలో సగటున నిమిషానికి ఒక కరోనా మరణం నమోదువుతుందని గ్లోబల్ హెల్త్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ బెత్ బెల్ తెలిపారు. ఇప్పటి వరకు అమెరికాలో 1.41కోట్ల మంది కరోనా బారినపడగా.. మరణాల సంఖ్య 2.80లక్షలకు చేరువైంది. ఇదిలా ఉంటే.. కరోనా టీకాపైనే అమెరికా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఫైజర్, మోడెర్నా సంస్థలు తాము అభివద్ధి చేసిన టీకా 90శాతానిపైగా సమర్థవంతంగా పని చేస్తున్నట్లు ప్రకటించాయి. టీకా అత్యవసర వినియోగం కోసం అనుమతి కోరుతూ ఎఫ్‌డీఏ, ఈయూకు దరఖాస్తు కూడా చేసుకున్నాయి. డిసెంబర్ చివరి నాటికి అమెరికన్లు ఈ వ్యాక్సిన్లు అందుబాటులోకి రావొచ్చని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత ఐటీ రంగానికి శుభవార్త

## హెచ్1బీ వీసా మార్పులను కొట్టేసిన అమెరికా కోర్టు

వాషింగ్టన్,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): ఇటీవల హెచ్ 1 బి వీసా కార్యక్రమంలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మార్పులను యుఎస్ కోర్టు మంగళవారం కొట్టివేసింది. ఈ చర్య భారత ఐటీ రంగానికి బాగా ఉపయోగపడనున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కొన్ని వారాల ముందు ట్రంప్ ప్రభుత్వం హెచ్1÷-ఖ బీ వీసా మార్పులు, కనీస వేతన స్థాయిలను పెంచడం, అర్హత అవసరాలను కఠినతరం వంటివి తీసుకొచ్చింది. కీలకమైన విధానపరమైన చర్యలను దాటవేయడానికి ట్రంప్ ప్రభుత్వం ఎంపికను సమర్థించలేదని, హూంల్యాండ్ సెక్యూరిటీ విభాగాన్ని, కార్మిక శాఖను విరమించుకునే విధానాల కోసం కూడా కోర్టు తీర్పు ఇచ్చింది.

# కౌలురైతుల లబోదిబో

## వేలాది ఎకరాల్లో పంటనష్టంతో తీరని వ్యథ

విజయవాడ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): నివర్ తుఫాన్‌తో సాధారణ రైతులే కాకుండా వేలాదిమంది కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారు. పెట్టిన పెట్టుబడి సంగతలా ఉంటే..మొత్తం కొట్టుకు పోవడంతో కౌలు కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నారు. జనసేనాని పవన్ కళ్యాణ్ పర్యటనలో కూడా ఇదే ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. పెద్దపారుపూడి, గుడ్లవల్లేరు, నందివాడ, ముదినేపల్లి మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టపోయిన వందలాది మంది దళిత, బలహీన, పేద కౌలు రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బివి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కౌలు కార్డులతో సంబంధం లేకుండా ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారం, 25 కేజీల మినుములు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నివర్ తుపాన్ వలన పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం చేస్తామన్న సాయానికి నిబంధనల మాటున పెద్ద ఎత్తున కోతలు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఒక సీజన్‌లో ఎన్ని విపత్తులచ్చి పంటలు పోయినా ఒక్క తడవే పరిహారం అనే షరతు ముందుకురాగా తాజాగా పంటల బీమా, పెట్టుబడి రాయితీరెండింటిలో ఏదో ఒకటే ఇవ్వాలనే అంశం తెర మీదికొచ్చింది. రబీ పంటలు సాగు చేసి నాలుగు వారాల్లోపే అయితే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఏ ఒక్కటీ రాదని సూత్రప్రాయంగా తేల్చారు.

ఖరీఫ్ పంట కోతల సమయంలో తుపాన్ ముంచెత్తడంతో వరి పంటకు అపార నష్టం జరిగింది. పంట కోసి పనల మీద ఉంటే బీమా వర్తిస్తుంది. ఇన్‌పుట్ సబ్సిడీ రాదు. వర్షాలకు వరి చేలల్లో నీళ్లలో వాలిపోయి మునిగిపోయి కుళ్లిపోయి తుడుచుపెట్టుకుపోయినా బీమా రాదు. అలాంటి రైతులకు కేవలం ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుంది. పంట నాశనం అయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రెండూ ఇచ్చినా రైతుకు జరిగిన పెట్టుబడుల నష్టం పూడదు. అలాంటిది ఏదో ఒక్కటేననడంతో అన్నదాతల్లో ఆందోళన బయలుదేరింది. ఉచిత పంటల బీమా వలన ఈ ఖరీఫ్ నుంచి ఇన్సూరెన్స్ క్లెయిముల మొత్తాన్నీ ప్రభుత్వమే భరించాలి.

రోవైపు ఇన్‌పుట్ సబ్సిడీ లబ్దిదారులను తగ్గించేందుకు నిబంధనలకు పదును పెడుతున్నారు. నివర్ వలన గుంటూరు జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.

నష్టం 1.33 లక్షల హెక్టార్ల నుంచి 50-60 వేల హెక్టార్లకు ఎన్యుమరేషన్‌లో తగ్గిస్తున్నారు. వరి చేలల్లో నుంచి వర్షపు నీరు తీసిందని, 35 వేల హెక్టార్లలో పంట బయట పడిందని చెబుతున్నారు. కృష్ణాలో 95 వేల హెక్టార్ల నుంచి 40 వేల హెక్టార్లకు తగ్గిస్తున్నారు. నెల్లూరులో వరి నాట్లు 3,300 హెక్టార్లలో దెబ్బతిన్నప్పటికీ నాలుగువారాల్లోపు ఉన్న నర్సరీలకు ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ రెండూ రావని నిర్ణయించారు. ప్రకాశంలో రబీ శనగ 17 వేల హెక్టార్లలో దెబ్బతినగా మొత్తం నాలుగువారాల్లోపు వేసినవేనని, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ రెండూ రావని తేల్చారు. కడపలో శనగ, మినుము, వరి విషయంలోనూ ఇదే నిబంధనను అమలు చేసి బాధిత రైతులకు బీమా, పెట్టుబడి రాయితీలను రాకుండా చేస్తున్నారు.

# అసెంబ్లీలో నాలుగోరోజూ రగడే

## సభ నుంచి టిడిపి సభ్యుల సస్పెన్షన్
## చంద్రబాబు ఫేక్ లీడర్ అంటూ నాని వ్యాఖ్యలు

అమరావతి,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో నాలుగో రోజు కూడా రగడ నెలకొంది. అలాగే టిడిపి సభ్యుల సస్పెన్షన్ కొనసాగింది. వాడీవేడీగా విమర్శలు,ప్రతి విమర్శలు సాగాయి. గురువారం నాడు సంక్షేమ పథకాలపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష పార్టీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత మంత్రులు సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో పెన్షన్ విషయంపై సుధీర్ఘ చర్చ జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక రూ.3000 పెన్షన్ ఇస్తామన్నారు..? అసలేమైంది..? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన మాటలను వైసీపీ సభ్యులు, మంత్రులు తప్పుబట్టారు. అంతేకాదు.. ఆయనపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు కూడా ఇచ్చారు.

ఈ క్రమంలో టీడీపీ సభ్యులు నిరసన వ్యక్తం చేయగా.. ఎమ్మెల్యే నిమ్మలపైకి వైసీపీ ఎమ్మెల్యేలు దూసుకెళ్లారు. పక్కనే ఉన్న అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, రామకృష్ణ.. నిమ్మలకు రక్షణగా నిలిచారు. ఇలా సభలో రగడ జరుగుతుండగానే.. టీడీపీ సభ్యులు స్పీకర్ పోడియంను చుట్టుముట్టారు. దీంతో టీడీపీ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ తమ్మినేని ప్రకటించారు. కాగా.. ఇవాళ సభలో రామానాయుడు చేసిన వ్యాఖ్యలపై సీఎం జగన్ మాట్లాడుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదే సందర్భంలో చంద్రబాబు నాయుడు ఫేక్ ప్రతిపక్ష నేత, టీడీపీ ఫేక్ పార్టీ అంటూ పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని ఫైర్ అయ్యారు. పొత్తు లేకుండా పోటీ చేయలేని వ్యక్తికి తమ నాయకుడిని విమర్శించే అర్హత లేదని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై చంద్రబాబు చేసిన విమర్శలను మంత్రి తిప్పికొట్టారు. పారిపోయేవాళ్లు ఎవరో ప్రజలందరికి తెలుసు. చంద్రగిరి వదిలి కుప్పం పారిపోయింది చంద్రబాబు కాదా. ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబు హైదరాబాద్ నుంచి పారిపోయారు. ఇక కరోనా రాగానే కాల్వగట్టు నుంచి హైదరాబాద్‌కు పారిపోయారు. ఆయనో ఫేక్ ప్రతిపక్షనేత అంటూ చురకలు అంటించారు. చంద్రబాబు పాలనలో ఒక్క పెన్షన్ కూడా పెంచలేదు. టీడీపీ హయాంలో ఎవరైనా చనిపోతేనే కొత్త పింఛన్ ఇచ్చేవారు.. కానీ సీఎం జగన్ వచ్చాక అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నాం. ఒకటో తారీఖునే ఠంచనుగా పింఛన్ అందిస్తున్నాం' అని తమ ప్రభుత్వ తీరును వివరించారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి పార్టీ లాక్కున్న వ్యక్తి చంద్రబాబు అని మంత్రి బొత్స విమర్శించారు. సొంతంగా పార్టీ పెట్టి అధికారంలోకి వచ్చిన ధీరుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రజామోదంతో సీఎం అయ్యారు. వెన్నుపోటు రాజకీయాలు ఆయనకు తెలియవు. చంద్రబాబు మెప్పు కోసమే టీడీపీ సభ్యులు ఆరోపణలు చేస్తున్నారు. ఉద్దేశపూర్వకంగానే సభను తప్పదోవ పట్టించాలని చూస్తున్నారు' అని మంత్రి బొత్స సత్యనారాయణ టీడీపీ సభ్యుల తీరును విమర్శించారు.

సీఎం జగన్‌పై జనసేన ఎమ్మెల్యే ప్రశంసలు

పేదల పెన్షన్ల గురించి మాట్లాడే అర్హత టీడీపీకి లేదని జనసేన పార్టీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ అన్నారు.

అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు మాసినక పరిస్థితి సరిగా లేదని విమర్శించారు. పెన్షన్ల గురించి మాట్లాడే హక్కు వైఎస్సార్‌కు, ఆయన తనయుడు వైఎస్ జగన్‌కే ఉందన్నారు. 'జగన్‌లాంటి నాయకుడు ఉండటం మన అదృష్టం. పేదల ఇంటి కల సాకారం చేసింది అప్పట్లో వైఎస్ఆర్.. ఇప్పుడు జగనే. సీఎం జగన్ లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. సచివాలయం ద్వారా ప్రతి గ్రామంలోనూ 30 నుంచి 40 మంది వలంటీర్లను నియమించారు. వలంటీర్ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమ ఆలోచన అని అందరూ ప్రశంసిస్తున్నారు. ఇళ్ల కోసం పేదలు ఇంతకుముందు ఎమ్మెల్యేల ఇంటి ముందు బారులు తీరేవారు. ఇప్పుడు ఆ అవసరం లేదు. ఎందుకంటే పేదల కోసం సీఎం జగన్ లక్షల ఇళ్లు ఇస్తున్నారు'ని రాపాక వరప్రసాద్ అన్నారు.

నాలుగోరోజూ టిడిపి సభ్యుల సస్పెన్షన్

నాలుగోరోజు టీడీపీ సభ్యులు శాసనసభలో గందరగోళం సృష్టించారు. ఎమ్మెల్యే పి.రాజన్నదొర మాట్లాడుతుండగా టీడీపీ సభ్యులు అడ్డుతగిలారు. ఎంత నచ్చజెప్పినా వినకుండా నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు తీవ్ర ఆటంకం కలిగించారు. దీంతో వెలగపూడి రామకృష్ణబాబు, వీరాంజనేయులు, అచ్చెన్నాయుడు, మంతెన రామరాజు, జోగేశ్వరరావు, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్‌లను సభ నుంచి ఒక రోజు పాటు సస్పెండ్ చేస్తున్నట్టు స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రకటించారు. సస్పెండ్ అయిన సభ్యులతో పాటు మిగతా టీడీపీ ఎమ్మెల్యేలు, చంద్రబాబు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు.

# పేర్ని నానిపై దాడితో పోలీసుల అప్రమత్తం

## గుడివాడలో కొడాలి నాని ఇంటికి భద్రత పెంపు

విజయవాడ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): రవాణా, సమాచార శాఖ మంత్రి పేర్ని నానిపై దాడి జరిగిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లాలోని మంత్రుల నివాసం, కార్యాలయాల్లో అదనపు భద్రతా చర్యలు చేపట్టారు. గుడివాడలోని పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని నివాసంలో మెటల్ డిటెక్టర్, డిజిటల్ స్కానర్లను ఏర్పాటు చేశారు. మంత్రి నివాసాన్ని అధీనంలోకి తీసుకున్న భద్రత సిబ్బంది ఆయన నివాసాన్ని డాగ్ స్క్వాడ్‌తో అణువణువునా తనిఖీలు చేస్తోంది. సందర్శకులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే మంత్రి నివాసంలోకి అనుమతిస్తున్నారు. కాగా, మంత్రి పేర్ని నానిపై హత్యాయత్నం కేసులో పోలీసులు దూకుడు పెంచారు. కోర్టు అనుమతితో నిందితుడు బడుగు నాగేశ్వరరావును మచిలీపట్నం సబ్ జైలు నుంచి కస్టడీకి తీసుకొన్నారు. రెండురోజుల పాటు విచారించనున్నారు. నిందితుడితో రెగ్యులర్‌గా టచ్‌లో ఉన్న టీడీపీ నేతలతో పాటు అతడి సోదరి బడుగు ఉమాదేవిని ఇప్పటికే విచారించారు. నిందితుడి కాల్ డేటాని కూడా పరిశీలిస్తున్నారు. హత్యాయత్నంపై నిరాధార వ్యాఖ్యలతో కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేసిన మాజీ మంత్రి కొల్లు రవీంద్రకు సెక్షన్ 91 కింద నోటీసులు పంపారు. ఆధారాలతో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. హత్యాయత్నంలో కుట్రకోణంపై వేగంగా విచారణ సాగుతుండటంతో నిందితుడు నాగేంద్రతో టచ్‌లో ఉన్న టీడీపీ నేతల గుండెల్లో దడ మొదలైంది. పోలీసుల కస్టడీలో నాగేశ్వరరావు ఏమి చెబుతాడోనని వెన్నులో వణుకుమొదలైంది. దీంతో టీడీపీ అగ్రనేతలను సంప్రదిస్తున్నట్టు తెలుస్తోంది.

# నకిలీ కరోనా వ్యాక్సిన్‌తో జాగ్రత్త

## ప్రపంచ దేశాలను హెచ్చరించిన ఇంటర్‌పోల్
## 3వేల నకిలీ వెబ్‌సైట్లు గుర్తించినట్లు వెల్లడి

న్యూఢిల్లీ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ వస్తున్న దశలో ప్రపంచవ్యాప్తంగా నకిలీలు బయలుదేరారు. ప్రజలను వ్యాక్సిన్‌తో బురిడీ కొట్టించేందుకు ఏకంగా 3వేల వెబ్‌సైట్లను ప్రారంభించారు. వీటిపట్ల తస్మాత్ జాగ్రత్త అంటూ ఇంటర్‌పోల్ హెచ్చరించింది. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే వాళ్లు నకిలీ కొవిడ్ వ్యాక్సిన్స్‌ను అమ్ముతారని, జాగ్రత్త అంటూ ఇంటర్‌పోల్ హెచ్చరించింది. ఈ మేరకు 194 దేశాల్లోని అన్ని పోలీసు వ్యవస్థలకు ఆరెంజ్ నోటీస్ జారీ చేసింది. ప్రపంచంలోనే తొలిసారిగా ఫైజర్ వ్యాక్సిన్‌కు యూకే అనుమతించిన రోజే ఇంటర్‌పోల్ ఈ వార్నింగ్ ఇవ్వడం గమనార్హం. కొవిడ్ వ్యాక్సిన్‌లకు సంబంధించి జరిగే నకిలీలు, చోరీలు, అక్రమ వ్యాపారాలపై ఓ కన్నేసి ఉంచాలని సూచించింది. నకిలీ వ్యాక్సిన్‌లను అడ్వర్టైజ్ చేయడం, అమ్మడం చేస్తున్న నేరాలకు సంబంధించిన సంఘటనలను కూడా ఇంటర్‌పోల్ వివరించింది. ప్రజా భద్రతకు ముప్పు వాటిల్లజేసే ఏదైనా ఘటన, ప్రక్రియ జరిగే సమయంలో ఇంటర్‌పోల్ ఇలా ఆరెంజ్ నోటీసు జారీ చేస్తుంది. ఇండియాలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్,. ఇంటర్‌పోల్‌తో కలిసి పని చేస్తుంది. వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం సురక్షితంగా జరగాలని అన్ని దేశాల పోలీసు వ్యవస్థలను ఇంటర్‌పోల్ కోరింది. ఇందులో భాగంగా నకిలీ వ్యాక్సిన్‌లను విక్రయించే అక్రమ వెబ్‌సైట్లను గుర్తించడం అత్యవసరమని సూచించింది. నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి నేరగాళ్లు ప్రయత్నించే ప్రమాదం ఉన్నదని, ఇది వారి ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు తెస్తుందని ఇంటర్‌పోల్ ప్రధాన కార్యదర్శి జు÷-గగ్గ÷న్ స్టాక్ హెచ్చరించారు. ఇలా నకిలీ వ్యాక్సిన్‌లను అమ్మడానికి ప్రయత్నిస్తున్న 3 వేల నకిలీ వెబ్‌సైట్లను ఇంటర్‌పోల్ ఇప్పటికే గుర్తించింది.

# 40 ఇయర్స్ విత్ అబ్దుల్ కలాం- అన్‌టోల్డ్ స్టోరీస్' పుస్తకావిష్కరణ




ఢిల్లీ , డిసెంబర్ 3: డాక్టర్ శివతాను పిళ్లై రచించిన 40 ఇయర్స్ విత్ అబ్దుల్ కలాం- అన్‌టోల్డ్ స్టోరీస్ పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు గురువారం విడుదల చేశారు. వర్చువల్ సమావేశం ద్వారా ఉప రాష్ట్రపతి ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. దేశ యువత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం నుండి ప్రేరణ పొందాలన్నారు. బలమైన, స్వావలంబన, సమగ్ర భారత దేశాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేద్దామన్నారు. గ్రామాలు, చిన్న పట్టణాల్లో ఉపాధి, ఆర్థిక అవకాశాలను సృష్టించాల్సిన అవసరాన్ని ఉపరాష్ట్రపతి నొక్కి చెప్పారు. వివిధ ఆర్థిక, సామాజిక సవాళ్లకు పరిష్కారాలను అందించేందుకు యువత ఆలోచించాలన్నారు. డాక్టర్ కలాం నిజమైన కర్మ యోగి అన్నారు. ప్రతి భారతీయుడికి ప్రేరణ అన్నారు. డాక్టర్ కలాం సలహాను అనుసరించి, స్థిరమైన, పర్యావరణ అనుకూలమైన అభివృద్ధి మార్గాన్ని అవలంబించాల్సిన సమయం ఇదే అన్నారు.

# సభను తప్పుదారి పట్టిస్తున్న నిమ్మల

## ముఖ్యమంత్రి జగన్ ఆగ్రహం
## సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు
## పలు బిల్లులకు సభ ఆమోదం

అమరావతి,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా సభను తప్పుదారి పటిస్తున్నారని, పదేపదే అబద్దాలు చెప్పేవారికి మాట్లాడే అవకాశం? ఇవ్వొద్దని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. రామానాయుడికి సభలో మాట్లాడే అర్హత లేదని, ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాస్తవాల ఆధారంగా రామానాయుడిపై చర్య తీసుకుంటామని స్పీకర్ సభలో ప్రకటించారు. సభలో వాస్తవాలు చెప్పాలని సభ్యులకు సూచించారు. రికార్డ్ నుంచి రామానాయుడు వాఖ్యలు తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా చర్చలో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. పెన్షన్ల పంపిణీపై టీడీపీ సభ్యులు చేసిన అసత్యాలను కొట్టిపారేశారు. ప్రతిపక్షం చేసిన ఆరోపణలపై చర్చను తాను సిద్ధమన్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎంత పెన్షన్ ఎంత అన్నది రాష్ట్రంలో ఎవ్వరిని అడిగినా చెబుతారని, ప్రతి ఒక్కరి నోటిలో నుంచి వచ్చేది రూ.1000 అని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రూ.2250 పెన్షన్ అందిస్తున్నామని సభలో స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు తన హయాంలో నాలుగు సంవత్సరాల 10 నెలల పాటు కేవలం రూ.1000 మాత్రమే పెన్షన్ ఇస్తూ, ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రం పెన్షన్ రూ.2 వేలు చేశారని విమర్శించారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు వరకు,రాష్ట్రంలో ఇచ్చిన పెన్షన్లు 44 లక్షలు మాత్రమేననీ, తమ ప్రభుత్వంలో 61.94 లక్షల పెన్షన్లు ఇస్తున్నామని వెల్లడించారు. చంద్రబాబు హయాంలో పెన్షన్ బిల్లు రూ.500 కోట్లు కూడా లేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వంలో నెలకు 1500 కోట్ల రూపాయలు పెన్షన్ల రూపంలో ఇస్తున్నామన్నారు. టీడీపీ నేతలు ఓ పద్ధతి ప్రకారం అబద్దాలు చెబుతూ.. మోసాలు చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికలకు ముందు ఏం చెప్పామన్నది మేనిఫెస్టోలో రాశామని, ఆ మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావిస్తాం అని కూడా చెప్పామన్నారు. సభలో చర్చ సందర్భంగా అసత్యాలు ప్రచారం చేస్తున్న టీడీపీ సభ్యుడు రామానాయుడుపై సీఎం జగన్ మండిపడ్డారు. ఆయన రామానాయుడు కాదు. డ్రామానాయుడని ఎద్దేవా చేశారు. అన్నీ అబద్దాలు చెబుతూ.. ఉద్దేశపూర్వకంగా సభను తప్పు దోవ పట్టిస్తున్నారని అన్నారు. ఆయనపై సభాహక్కుల ఉల్లంఘన తీర్మానం కోరుతామన్నారు. ఆ తర్వాత సభా నాయకుడి సూచన మేరకు టీడీపీ సభ్యుడు రామానాయుడిపై సభా హక్కుల ఉల్లంఘనకు సంబంధించి చర్యలు కొనసాగుతాయని స్పీకర్ తెలిపారు. పేదల అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, ఏడాదిన్నరలో సంక్షేమ పథకాల ద్వారా రూ.67వేల కోట్లు అందించామని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పథకాలపై సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ... ఒక్క కుటుంబానికి కూడా కన్నీళ్లు లేకుండా సంక్షేమం అందించారని ప్రశంసించారు. ప్రభుత్వానికి ఆదాయం లేకపోయినా సంక్షేమ పథకాలు ఆపలేదని, లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పడే వ్యవస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. ఏ పథకానికి ఎవరు అర్హుల్లో గుర్తించడమే పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. భూ యజమానులకు శాశ్వత హక్కులు కల్పించడమే లక్ష్యంగా ల్యాండ్ టైట్లింగ్ బిల్లు ప్రవేశపెట్టినట్టు ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ బిల్లుతో భూ వివాదాలకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రెవెన్యూ చట్టాలను సంస్కరించి తయారు చేసిన ఈ బిల్లుతో భూ వివాదాలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, సామినేని ఉదయభాను అభిప్రాయపడ్డారు. చర్చ తర్వాత ఏపీ భూ హక్కుల యాజమాన్య బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. మంత్రి బొత్స సత్యనారాయణ ప్రవేశపెట్టిన ఏపీ మున్సిపల్ లా సెకండ్ అమెండ్‌మెంట్ బిల్లుపై చర్చించిన తర్వాత సభ ఆమోదం తెలిపింది. దిశా చట్టం సవరణ బిల్లు ఆమోదం సందర్భంగా టీడీపీ సభ్యులు సభలో గందరగోళం సృష్టించారు. తమ?కు మాట్లాడే ఇవ్వాలని పట్టుబడుతూ సభా కార్యకలాపాలకు అడ్డుతగిలారు. ఎవరెవరు మాట్లాడతారో ముందుగా తన లిస్టు పంపించకుండా ఇలా మధ్యలో అడగడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని స్పీకర్ వివరణయిచ్చారు. మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేశ్.. టీడీపీ సభ్యుల తీరును తప్పుబట్టారు. టీడీపీ సభ్యుల నినాదాల నడుమ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ల్యాండ్ టైట్లింగ్ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టారు. కాసేపు సభకు అడ్డం పడి సభ నుంచి టీడీపీ సభ్యులు బయటకు వెళ్లిపోయారు.

### దిశా చట్టానికి 4 జాతీయ అవార్డులు: సుచరిత

గతంలో చేసిన దిశా చట్టానికి సవరణలు చేసి తాజాగా శాసనసభలో పెట్టారు. సవరణ బిల్లుపై హోం మంత్రి మేకతోటి సుచరిత మాట్లాడుతూ.. మహిళలు, చిన్నారులపై జరిగే దాడుల నివారణకు దిశా చట్టాన్ని తెచ్చినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 18 దిశా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, విచారణ వేగవంతం కోసం డీఎస్పీస్థాయి అధికారిని నియమించినట్టు చెప్పారు. తిరుపతి, మంగళగిరి, విశాఖలో ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. దిశా చట్టానికి జాతీయస్థాయిలో 4 అవార్డులు వచ్చాయన్నారు. దిశా చట్టంతో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని విశ్వాసం చేశారు. దిశా చట్టం వచ్చాక 3 కేసుల్లో ఉరిశిక్షలు పడ్డాయని వెల్లడించారు. దిశ యాప్‌ను లక్షలాది మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. మంత్రి ప్రసంగం తర్వాత దిశా చట్టసవరణ బిల్లును సభ ఆమోదించింది.

### ఎలక్ట్రిసిటీ డ్యూటి బిల్లు ఆమోదం

ఃూక్షి, అమరావతి: ఆంధప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలు నాలుగో రోజు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఏపీ విద్యుత్ సుంకం సవరణ(ఏపీ ఎలక్ట్రిసిటీ డ్యూటి అమెంట్‌మెంట్) బిల్లుపై చర్చకు స్పీకర్ తమ్మినేని సీతారాం అంగీకరించారు. దీంతో మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చర్చను ప్రారంభించారు. మంత్రి ప్రసంగం తర్వాత బిల్లు సభ ఆమోదం పొందింది. తర్వాత దిశా చట్టంపై చర్చ ప్రారంభమైంది. నగదు బదిలీ, కరోనా కట్టడిపై శాసన సభలో స్వల్పకాలిక చర్చ జరగనుంది. కాగా, మీడియా, బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ వర్గాలపై దాడులు అరికట్టాలంటూ చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. అసెంబ్లీకి ర్యాలీగా వచ్చారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ సంక్షేమ పథకాలపై శాసన సభలో చర్చించనున్నారు. శాసన మండలిలో నేడు 9 బిల్లులపై చర్చ జరగనుంది. పోలవరం, ఉద్యోగుల సంక్షేమం, శాంతిభద్రతలపై శాసన మండలి చర్చించనుంది.

# రాజమండ్రి కాలేజీలో మైనర్ల వివాహం

## క్లాస్‌రూమ్‌లోనే ఒక్కటయిన స్నేహితులు
## కలకలం రేపిన పెళ్లి ఘటన

కాకినాడ,డిసెంబర్3(ఆర్ఎన్ఎ): తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్లాస్ రూమ్‌లో ఇద్దరు మైనర్ల పెళ్లి కలకలం సృష్టించింది. విద్యార్థులపై చర్యలు తీసుకున్నామని ప్రిన్సిపల్ మేరీ సుజాత చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం వాళ్లు సరదా కోసమే ప్రేమ వివాహం చేసుకున్నట్లు విచారణలో తెలిందని కాలేజీ ప్రిన్సిపాల్ మేరీ సుజాత తెలిపారు. అయినా ఇలాంటి పనులు కాలేజీలో చేయడం తప్పని భావించి ఇద్దరు విద్యార్థులకు గట్టి వార్నింగ్ ఇచ్చి, వారికి సహాయం చేసిన మరో విద్యార్థికి కూడా టీసీ ఇచ్చి కాలేజీ నుంచి ముగ్గురిని పంపిచామని తెలిపారు. నవంబర్ 27న విద్యార్థుల తల్లిదండ్రులు పెళ్లి వీడియో తమ దృష్టికి తెచ్చారని ప్రిన్సిపాల్ మేరీ సుజాత చెప్పారు. దీనిపై తాము విచారణ జరిపినప్పుడు నవంబర్ 17వ తేదీ ఉదయం 8-30 గంటలకు ముగ్గురు విద్యార్థులు కాలేజీకి వచ్చి ఈ విధంగా చేస్తే లైక్‌లు ఎన్ని వస్తాయో చూద్దామని సరదాగా ఫ్రాంక్ వీడియో తీసుకున్నామని, తర్వాత భయం వేసి వెంటనే వీడియోను తొలగించామని విద్యార్థులు వ్రాతపూర్వకంగా ఇచ్చారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విషయం తమ తల్లిదండ్రులకు చెప్పినా వినడంలేదని, తాము సరదాగా తీసుకున్నదే తప్పు.. ఎలాంటి చెడు ఆలోచన లేదని విద్యార్థులు చెప్పారని ఆమె అన్నారు. కాలేజీ ఉదయం 9-30 తెరుస్తామని, అయినా వారు 8-30 గంటలకే కాలేజీకి వచ్చి ఫ్రాంక్ వీడియో తీయడం తప్పని భావిస్తూ.. వారికి టీసీ ఇచ్చి పంపిచామని ప్రిన్సిపల్ మేరీ సుజాత తెలిపారు.

# వరద బాధిత కుటుంబానికి రూ .4 లక్షల ఎక్స్‌గ్రేషియా



సంగారెడ్డి , డిసెంబర్ 3: జిల్లాలోని అమీన్‌పూర్ నివాసి అనంతుల ఆనంద్(30) గడిచిన అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షానికి పోటెత్తిన వరద ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందాడు. బాధిత కుటుంబానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గురువారం రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేశారు. అదేవిధంగా ఆనంద్ భార్యకు త్వరలోనే ఉద్యోగం వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కురిసిన వర్షాలకు అమీన్‌పూర్ ప్రాంతంలో భారీ వరదలు వచ్చాయి. ఆనంద్ అక్టోబర్ 13 అర్థరాత్రి ఇసుక బావి వద్ద వరద ప్రవాహాన్ని దాటుతుండగా అతని కారు ప్రవాహంలో కొట్టుకుపోయింది. ఆరు రోజుల తరువాత నీటి ప్రవాహం తగ్గినప్పుడు అతని కారు, శరీరాన్ని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కనుగొని బయటకు తీసింది. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు.

కిన్నెర ఆర్ట్ థియేటర్స్

# పి.వి. శతజయంతి వ్యాసరచన పోటీ ఫలితాలు




కిన్నెర ఆర్ట్ థియేటర్స్, 'నేటినిజం' దినపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో మాన్యులు శ్రీ పి.వి. మనోహరరావుగారి సౌజన్యంతో భారత పూర్వ ప్రధాని కీ.శే. పి.వి. నరసింహారావుగారి శతజయంతి సందర్భంగా వారి వ్యక్తిత్వ సాహిత్యాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఆసక్తిగా పాల్గొన్న వారందరూ అభినందనీయులు. విద్యార్థులతో పాటు సాహిత్య రంగంలో పేరొందిన వారు సైతం ఈ పోటీలో పాల్గొనడం ఎంతో ముదావహం. పి.వి.గారి ప్రతిభావైదుష్యానికి వీరంతా అక్షర రూపం ఇచ్చారు.

నిశిత పరిశీలనానంతరం ఈ పేర్కొన్న వ్యాసాలను బహుమతికి అర్హంగా భావించి నిర్ణయించడమైంది.

ఉత్తమ బహుమతి రూ.5000/- : స్థిత ప్రజ్ఞునికి శతవందనం
శ్రీ కడియాల ప్రభాకరరావు
98490 38058

ద్వితీయ బహుమతి రూ.3000/- : మేరు నగధీరుడు- మేధావి పి.వి.
డా॥వడ్డేపల్లి కృష్ణ
9246541699

తృతీయ బహుమతి రూ.2000/- : బహుముఖ ప్రజ్ఞాశాలి పి.వి. నరసింహారావు
శ్రీ గంధం చంద్రశేఖరరావు
97037 25659

ప్రోత్సాహక బహుమతులు: ఒక్కొక్కరికి 500/-
1.స్థితప్రజ్ఞుడు పి.వి.
డా॥ కర్నాటి లింగయ్య
9515298610
2. పి.వి. వ్యక్తిత్వం-జీవితం-సాహిత్యం
శ్రీమతి కుసుమ ఉప్పలపాటి
97050 09254

న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు సుధామ గారికి ధన్యవాదాలు.

-కిన్నెర రఘురాం
సెల్:9866057777

# బిగ్ బాస్ గంగవ్వను కలిసిన వేములవాడ వాసులు



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 3 (నేటనిజం ప్రతినిధి):బిగ్ బాస్ గంగవ్వను గురువారం ఆమె నివాసంలో కలిసిన వేములవాడ యువకులు పుల్లూరి కృష్ణ సుబహన్ తదితరులు కలిసి ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. ఆమె ఆరోగ్య క్షేమం గురించి అడిగారు .

# బ్రిటిష్ వారిని ఎదిరించిన వీరపుత్రుడు ఖుదీరామ్ బోస్

## నేడు ఆయన జయంతి (సందర్భంగా ...)

న్యూఢిల్లీ,డిసెంబర3(ఆర్ఎన్ఎ): స్వాతంత్ర సమర యోధుడు, అతి పిన్న వయసులోనే తెల్లవాళ్ళపై తిరగబడ్డ విప్లవవీరుడు, తల్లి భారతి ముద్దుబిడ్డ ఖుదీరామ్ బోస్. ఎందరికో స్ఫూర్తి నింపి మరెందరికో ఆరాధ్యనీయుడైన సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు ఖుదీరామ్ బోస్ జయంతి డిసెంబర్ 3. 1889లో అతను నాటి బెంగాల్లో జన్మించాడు. ఆగస్ట్11న 1908లో అతడిని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసింది. నేను పట్టుబడితే మహా అయితే నన్ను ఉరి తీయవచ్చును కానీ ఇది నాకు వరం, నాకు తల్లి , తండ్రి గురువు అన్నీ నా భరతమాతే అని గర్వంగా చెప్పిన ధీరుడాయన. ఆ తల్లి రుణం తీర్చుకోవడానికి నా ప్రాణాలను అర్పించడం ఒక అదృష్టంగా భావిస్తాను.. నా కోరిక ఒక్కటే ... మన దేశానికి స్వాతంత్య్రం వచ్చే వరకూ నేను మళ్ళీ మళ్ళీ ఈ గడ్డపైన పుట్టి, నా జీవితాన్ని త్యాగం చేయాలని ప్రకటించారు. విప్లవవీరుల రహస్య సమావేశంలో సాయుధ పోరాటంలో రాటుదేలిన యోధులకి సైతం స్ఫూర్తినిస్తూ ముక్కుపచ్చలారని పసివాడు ఖుదీరామ్ బోస్ బాంబుదాడి చేయడానికి వెళుతూ చెప్పిన మాటలు.. బ్రిటీష్ వారిచ్చే బహుమతికి కక్కుర్తిపడి సాటి భారతీయుడే అతనని పట్టిచ్చాడు. ఉరిశిక్ష విధించిన జడ్జీనీ చివరికోరిక ఏంటని ప్రశ్నించినపుడు ఖుదీరామ్ బోస్ చెప్పిన సమాధానం గమనిస్తే...మీరు గనుక అనుమతిస్తే ఇక్కడున్న నా భారతీయ సోదరులకు కూడా బాంబుల తయారీ గురించీ, దాని మెళుకువల గురించీ చెప్పాలనుకుంటున్నాను అని సమాధానం ఇచ్చాడు. కోర్టు దానికి అనుమతించకపోవడంతో తన స్ఫూర్తిని ప్రజల్లో నింపుతూ వందేమాతర నినాదం చేస్తూ, భరతమాతకు జై కొడుతూ భగవద్గీత చేతో పట్టుకుని ఉరికంబానికి వేలాడి తన దేశభక్తిని చాటుకున్న గొప్ప దేశభక్తుడు ఖుదీరామ్ బోస్. !వందేమాతర గీతం సారాన్ని నిరక్షరాస్యులైన ప్రజలకు అర్ధమయ్యేలా, విద్యావంతులకు స్ఫూర్తినిచ్చేలా కరపత్రాలను తయారు చేసి స్వయంగా పంచుతూ అడ్డగించిన బ్రిటీష్ సైనికులపై ప్రతిదాడి చేసి బ్రిటీష్ ప్రభుత్వానికి వణుకు పుట్టించిన భారత బెబ్బులి ఖుదీరామ్ బోస్. ఇలాంటి దేశభక్తుల చరిత్రలు తెలియని వారికి ముఖ్యంగా పిల్లలకూ తెలియచేసాల్సి ఉంది.

# ఘనంగా శ్రీకాంతాచారి వర్ధంతి వేడుకలు



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి):మలిదశ తెలంగాణ ఉద్యమంలో అమరుడైన కాసోజు శ్రీకాంతచారి 11 వ వర్ధంతి వేడుకలను చందుర్తి మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు వికృతి లక్ష్మీనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా శ్రీకాంతచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2009 నవంబర్ 29న ఎల్బీనగర్ లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా కెసిఆర్ ను అరెస్టు చేయగా ఇందుకు నిరసనగా నిరసన ధర్నా కార్యక్రమంలో శ్రీకాంతాచారి ఒంటిమీద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆయన అన్నారు, ఐదు రోజుల పాటు శ్రీకాంతాచారి జై తెలంగాణ అంటూ మృత్యువుతో పోరాటం చేస్తూ డిసెంబర్ 3న తుది శ్వాస విడిచార న్నారు, శ్రీకాంతచారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కడారి నరేష్, కట్కూరి ముఖేష్, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# దేశంలోనే అత్యుత్తమ పోలీస్ స్టేషన్‌గా జమ్మికుంట- అభినందించిన డీ.జీ.పీ. మహేందర్ రెడ్డి

కరీంనగర్ డిసెంబర్ 3 (నేటినిజం ప్రతినిధి): దేశంలోనే అత్యుత్తమ పది పోలీస్ పోలీస్ స్టేషన్లలో ఒకటిగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కు చెందిన జమ్మికుంట పోలీస్ స్టేషన్ ఎంపిక కావడం పట్ల డీ.జీ.పీ. ఎం. మహేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పౌర సేవల విభాగంలో అత్యుత్తమ సేవలంచడం, పోలీస్ స్టేషన్ల మధ్య స్నేహపూర్వక పోటీ తత్వాన్ని కల్పించేందుకు దేశవ్యాప్తంగా పది అత్యుత్తమ పోలీస్ స్టేషన్లను కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం ఎంపిక చేస్తుంది. ఈ 2020 సంవత్సరానికి గాను ఎంపిక చేసిన పది ఉత్తమ పోలీస్ స్టేషన్లలో కరీం నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని జమ్మికుంట పోలీస్ స్టేషన్ ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.. కాగా, వరుసగా రెండవసారి కరీం నగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్ స్టేషన్ గా నిలవడం పట్ల డీ.జీ.పీ మహేందర్ రెడ్డి కరీం నగర్ కమిషనర్ వి.బీ. కమల హాసన్ రెడ్డి, జమ్మికుంట స్టేషన్ హౌస్ అధికారి తో పాటు ఈ ఘనతను సాధించిన ఇతర పోలీస్ అధికారులను అభినందించారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ కు దక్కిన ఈ పురస్కారం స్ఫూర్తిగా రాష్ట్రంలోని ఇతర పోలీస్ స్టేషన్లు కూడా ఆదర్శంగా తీసుకొని ఉత్తమ పౌర సేవలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలుకు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. 2019 సంవత్సరం లో చొప్పదండి పోలీస్ స్టేషన్ 7 వ ఉత్తమ పోలీస్ స్టేషన్ గా నిలిచింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.